

ఎన్జీ రంగా.. అందరికీ ఆదర్శం

- 50 ఏళ్ల పార్లమెంటేరియన్‌గా గిన్నీస్ రికార్డు
- వ్యవసాయ వర్సిటీకి ఆచార్య పేరు ఘనత మాదే
- జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు

రంగానే నాకు స్ఫూర్తి

రైతు గౌరవమే దేశ గౌరవం. రైతు సంక్షేమమే దేశాభివృద్ధి.. అని ఎన్జీ రంగా చెబుతుండేవారు. పార్లమెంట్ లోపల, బయట ఆయన ఎన్నో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు. అవన్నీ నాపై ప్రభావం చూపించాయి. రూరల్ డెవలప్‌మెంట్‌పై పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు ఆయన రచనలు, అధ్యయనాలే నాలో స్ఫూర్తిని నింపాయి.

- సీఎం చంద్రబాబు

గుంటూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'స్వాతంత్ర్య పోరాటంలో వెనకబడిపోతామనే కారణంతో రంగా దంపతులు పిల్లలనే వద్దనుకున్నారు. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నప్పటికీ ఆయన జీవితమంతా స్వాతంత్ర్య సాధనకు, రైతు సంక్షేమానికి కృషి చేశారు..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్జీ రంగా గురించి తెలుపుతూ ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయన్నారు. శుక్రవారం ఎన్జీ రంగా 125వ జయంతి వేడుకలు గుంటూరులోని లాంఫారంలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగాయి. తొలుత రంగా కుటుంబసభ్యులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ రంగానికి రంగా చేసిన సేవలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో సీఎం ఉపన్యసించారు. వందేమాతర గేయానికి 150 ఏళ్లు పూర్తయిన రోజునే రంగా 125వ జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో వ్యవసాయ యూనివర్సిటీకి, విభజన తర్వాత నవ్యాంధ్రలో వ్యవసాయ వర్సిటీకి ఎన్జీ రంగా పేరు (మిగతా 6వ పేజీలో)



ఎన్జీ రంగా జీవిత విశేషాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు

ఈకేవైసీ పెండింగ్

- గడువు ముగిసినా 2.76 లక్షల కార్మికుల ఈకేవైసీ పెండింగ్
- పూర్తయిన వారికే పని, వేతనం
- అమలులో జాప్యం..అవగాహన కల్పనలో నిర్లక్ష్యం

ఉపాధి హామీ పథకం మస్టర్లలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. పనులకు హాజరు కాకుండానే వేతనం చెల్లించడం వంటి అవకతవకలు జరుగుతున్నాయి. ఇందులో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏటా రూ.కోట్లలో ఉపాధి నిధులు పక్కదారి పడుతున్నట్లు సామాజిక తనిఖీ తెలియజేస్తోంది. అక్రమాలకు చెక్ పెట్టేందుకు కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఉపాధి కూలీకి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత నెల ఆరంభం నుంచి అమల్లోకి వచ్చిన ప్రక్రియ గడువు ముగిసినా.. ఈ నెలలో కూడా ఈకేవైసీ చేయించుకునేందుకు అవకాశం కల్పించినట్లు సబంధిత అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ అమల్లో తీవ్ర జాప్యం జరగుతోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో ఇంకా 2.76 లక్షల మంది కూలీల ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. ఈ పథకం అమలులో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కూలీలకు అవగాహన కల్పించి అందరికీ ఈకేవైసీ పూర్తి చేసే దిశగా అధికారు లు చర్యలు చేపట్టకుంటే వారు పనులను కోల్పోయే ప్రమాదం ఉంది.

'ఉపాధి'లో బోగస్ హాజరు నిరోధానికి ఎన్ఎంఎంఎస్

పల్నాడు జిల్లాలో 5,40,928 మంది కూలీలకు జాబ్ కార్డులకు 5,32,092, బాపట్ల జిల్లాలో 4,32,348 మంది కూలీలకు గాను 4,29,863, గుంటూరు జిల్లాలో 2,03,292 మంది జాబ్ కార్డులకు 1,99,031 మంది కార్డులకు ఆధార్ సీడింగ్ పూర్తయింది.



ఉపాధి పనుల్లో కార్మికులు(పాత చిత్రం)

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

పనులు చేసిన ఉపాధి హామీ పథకం కూలీలు నష్టపోకుండా ఉండేలా.. బోగస్ హాజరును నిరోధించేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) అమలులోకి వచ్చింది. దీంతో పాటు ఫేస్ ఆర్‌డీ యాప్‌ను సైతం అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. లేకుంటే చేసిన పనికి వేతనం చెల్లించే పరిస్థితి ఉండదు. ఈకేవైసీ వేగవంతంగా పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు క్షేత్రస్థాయి వరకు ఆదేశాలు జారీ అయ్యాయి. కూలీలకు అవహగాన లేక పోవడంతో ఈకేవైసీ చేయించు కునేందుకు ముందుకు రావడం లేదు. వారికి అవగాహన కల్పించాల్సి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉపాధి కూలీల జాబ్ కార్డు నంబరును నమోదు చేసి, ఐరిష్, ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న కూలీలను మాత్రమే ఉపాధి పనులకు అనుమతిస్తారు.. వేతనాలు చెల్లిస్తారు. ఈ నెల ఆరంభం నుంచి కూలీలు పని ప్రదేశంలో పని ప్రారంభించే ముందు ఒకసారి, పని ముగిశాక మరోసారి వ్యక్తిగత ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అలా చేస్తేనే కూలీలకు వేతనాలు మంజూరవుతాయి. ఉపాధి పథకంలో అక్రమాలు అరికట్టి, పనులకు వెళ్లే కూలీలకు మాత్రమే కూలి అందుతుంది.

జిల్లాల వారీగా ఉపాధి కూలీల ఈకేవైసీ వివరాలు

జిల్లా	కూలీల సంఖ్య	ఈకేవైసీ పూర్తి	ఈకేవైసీ పెండింగ్	శాతం
పల్నాడు	5,32,092	4,03,735	1,28,357	75.87
బాపట్ల	4,29,863	3,40,556	89,307	79.22
గుంటూరు	1,99,031	1,40,063	58,931	70.37

బోగస్ కార్డులకు చెక్

ఉపాధి పనులపై గ్రామాల్లో రాజకీయ నేతల ప్రభావం అధికంగా ఉంది. వీరి కనుసన్నల్లో (మిగతా 6వ పేజీలో)

పంటలు చూడకుండా నివేదికలా?

- తప్పుడు లెక్కలతో చేతులు దులుపుకుంటారా..?
- వ్యవసాయ అధికారులపై ఎమ్మెల్యే ఆనందబాబు ఆగ్రహం

వేమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతే.. వాటిని చూడకుండానే నివేదిక లు ఎలా ఇస్తారు.. రైతులు తీవ్రంగా నష్టపోయి ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తుంటే.. తప్పుడు లెక్కలతో చేతులు దులుపుకుం టారా.. నష్టపోయింది మీ కళ్లకు కనబడటం లేదా.. ప్రభుత్వానికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాను.. అంటూ ఎమ్మెల్యే ఆనందబాబు వ్యవసాయాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలు నష్టపోయిన రైతులు ఎమ్మెల్యేని కలిసి వ్యవసాయ శాఖ అధికారులపై ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని 17 గ్రామాల్లో పంటలు నష్టపోతే కేవలం ఐదు ఎకరాలని నివేదిక ఇచ్చారని వాపోయారు. ముఖ్యమంత్రి రైతులకు సహకరించేందుకు ముందుకు వస్తే ఇలా ప్రవర్తించడం ఎంతవరకు సబబని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. సమాధానం చెప్పని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అలసత్వాన్ని విడనాడకపోతే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఇచ్చిన అర్జీలను ఎమ్మెల్యే పరిశీలించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించి ఎక్కువగా వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రతీ శుక్రవారం ఒక్కో మండలంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు.



ప్రజాదర్బార్‌లో అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వందేమాతరం గీతాలాపన..

150 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా వందేమాతరం గీతాన్ని ఎమ్మెల్యే ఆలపించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిశోర్‌కుమార్, తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో రవికుమార్, సీఐ రామాంజనేయులు, ఏపీఎం శోభన్, ఎస్ఐ శ్రీనివాసరావు, ఏవో ప్రేమ్‌సాగర్, సొసైటీల అధ్యక్షులు ఉక్కుర్తి నాగేశ్వరరావు, బొల్లిముంత నాగకుమారి తదితరులు పాల్గొన్నారు.

బడి నుంచే భవితకు భరోసా!

పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యా కోర్సులు ● పల్నాడు జిల్లాలో 66 ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ ● సర్వశిక్ష ఆధ్వర్యంలో పర్యవేక్షణ ● 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అమలు

8

కళల విందుగా.. బాలల పండుగ !



- ఘనంగా ప్రారంభమైన వీవీఐటీయూ బాలోత్సవ్-2025
- అతిథుల చేతుల మీదగా పోటీలు ఆరంభం
- చిన్నారుల నైపుణ్యం వెలుగులోకి: ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

రూ.6,600 కోట్లతో అభివృద్ధి పనులు

సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు ● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.6,600 కోట్లు మంజూరు చేయించినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. శుక్రవారం బాపట్ల మండలం గుడిపూడి గ్రామం నుంచి కర్లపాలెం వరకు రూ.2 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లాలో పర్యాటకాభివృద్ధికి సంబంధించి రూ.97.52 కోట్లతో సూర్యలంక బీచ్‌లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే వేగేశన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ఆర్అండ్‌బీ మంత్రితో మాట్లాడి రూ.14.75 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మ తులు చేపడతామన్నారు. ప్రజలు కాంట్రాక్టర్ల కు సహకరించాలని అప్పుడే పనులు సకాలంలో పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు హనుమాన్‌జీ, ఆచంట అమ రేష్, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ వై.భూపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

అగ్నిమాపక సిబ్బంది పోరాట యోధులు

- అగ్నిమాపక కేంద్రం భూమిపూజలో మంత్రి పార్థసారథి

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల్లో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సేవలు ఎనలేనివని, వారు పోరాట యోధులని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో చీరాలలో నిర్మించనున్న అగ్నిమాపక కేంద్రానికి శుక్రవారం మంత్రి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను తెగించి ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. గుండ్లకమ్మ నదిలో చిక్కుకున్న వారి ని సైతం ప్రాణాలకు తెగించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారని కొనియడారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ప్రజలు ఆందోళనలో ఉండగా ఎమ్మెల్యే కొండయ్య ముందు చూపు కొంత ధైర్యాన్ని నింపాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ కృష్ణప్రసాద్, అగ్నిమాపక ప్రాంతీయ అధికారి ఎంఏ జిలాని, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, ఏడీఎఫ్‌వో రామకృష్ణ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే కొండయ్య, కలెక్టర్ వినోద్‌కుమార్

నష్టం.. 33,750 ఎకరాలే

పొంతన లేకుండా అధికారుల నివేదికలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ధాటికి జిల్లా వ్యాప్తంగా 84,500 ఎకరాల్లో పంట ముంపు బారిన పడిందని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా తేల్చింది. అయితే 33,750 ఎకరాల్లో మాత్రమే పంటలు నష్టపోయాయని తుది నివేదికలో తేల్చింది. తుఫాన్‌కు ముందు, ఆ తర్వాత భారీ వర్షాలతో జిల్లాలో పెద్దఎత్తున పంటలు నీటమునిగాయి. రోజుల తరబడి పొలాల్లో నీరు నిలిచి పంటలన్నీ వర్ణార్పణమయ్యాయి. అయితే ప్రాథమిక అంచనాలకు మించి నష్టం పెరగాల్సింది పోయి తగ్గడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫీల్డ్ విజిట్‌తో ఏపీఎయిమ్స్ యాప్‌లో పంట నష్టం వివరాలు నమోదు శుక్రవారంతో ముగిసింది. నష్టపోయిన పంటల వివరాలతో తుది జాబితాను వ్యవసాయశాఖ ఖరారు చేసింది. కానీ ప్రాథమిక నివేదిక దరిదాపుల్లో కూడా తుది గణాంకాలు లేకపోవడంపై పలువురు విస్తుపోతున్నారు. ఏకంగా 50,750 ఎకరాలకు తుది జాబితాలో చోటు దక్కకపోవడం ఆశ్చర్య పరిచేదిలా ఉంది. దాదాపు ఐదు రోజులు పొలాలు ముంపులోనే ఉండగా తుది జాబితా మరీ ఇంత తక్కువగా ఎలా ఉందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. హడావిడిగా వాస్తవికతకు దూరంగా ప్రిలిమనరీ నివేదికను యంత్రాంగం చేసిందా లేక ఏపీ ఎయిమ్స్ యాప్ నిబంధన అనేదే నష్ట తీవ్రత లెక్కలు తగ్గడానికి కారణాలుగా ఉన్నాయా అనేది తేలాల్సి ఉంది. ఈ-క్రాప్ నమోదు, ఏపీ ఎయిమ్స్ యాప్ వంటి అంశాల పట్టింపు లేకుండా నష్టం వివరాల నమోదుకు మ్యాన్యువల్‌గా అవకాశం ఇస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో ఇది అమలు కాలేదు.

తుఫాన్ సాయం గందరగోళం

- అస్తవ్యస్తంగా నిత్యావసరాల పంపిణీ
- రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి

- సమన్వయం లోపంతో బాధితులకు ఇబ్బందులు
- అర్హులకు ఫలాలు చేరాలనే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన మొంథా తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీలో గందరగోళం నెలకొంది. భారీ వర్షాలతో రోజుల తరబడి మత్స్యకారులు, చేనేత కార్మికులతో పాటు పలువురు జీవనోపాధి కోల్పోయారు. ఈ క్రమంలో వారికి తక్షణ ఉపశమనం కోసం ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలను కిట్ల రూపంలో యుద్ధ ప్రాతిపదికన అందించాలని యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. కానీ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పంపిణీ ఓ ప్రహసనాన్ని తలపించేలా సాగుతోంది. నిత్యావసరాల కోసం పలు దఫాలుగా రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన వస్తోందని బాధితులు వాపోతున్నారు. బాధితుల్లో రేషన్‌కార్డు లేని వారుంటే వారికి కూడా మ్యాన్యువల్ ప్రాతిపదికన సాయం అందించాలని ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా అమలు చేసే వారే లేరు. బాధిత కుటుంబాలకు సాయం అందించడంలో ఎలాంటి ఉదాశీనత కనబడకూడదని, అర్హులందరికీ ఫలాలు చేరాలనే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచేలా క్షేత్రస్థాయిలో పంపిణీ సాగుతోంది. నిత్యావసరాలను కిట్‌గా అమర్చి రేషన్ షాపులకు చేర్చాల్సిన బాధ్యత (మిగతా 6వ పేజీలో)



తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ (పాత చిత్రం)

రజిని అనుచరుల బాధితులు..

పోలీసులను సంప్రదించండి

● పల్నాడు జిల్లా పోలీస్ శాఖ

నరసరావుపేట లీగల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడుదల రజిని అనుచరుల చేతిలో మోసం, బెదిరింపులకు గురైన బాధితులు పోలీసులను సంప్రదించాలని పల్నాడు జిల్లా పోలీస్ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రజిని అనుచరులు బత్తుల శ్రీగణేష్, బత్తుల కుమారస్వామి, పీఏలు మానుకొండ శ్రీకాంత్ రెడ్డి, దొడ్డా రామకృష్ణ చిలకలూరిపేట మండల పరిధిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని.. పలువురు నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం ఉందని తెలిపింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

గంజాయి విక్రేతకు మూడేళ్ల జైలు, జరిమానా

బెల్లంకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రేత వలమాల గోవిందు అనే వ్యక్తికి మూడేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ.. గుంటూరు మొదటి అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఏవీఎల్ సత్యవతి శుక్రవారం తీర్పునిచ్చారు. ఎస్ఐ ప్రవీణ్ వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి ఏలూరు మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన గోవిందు.. మండలంలోని చంద్రాజుపాలెం దర్గా వద్ద గంజాయి విక్రయిస్తుంగా.. 2019 అక్టోబరు 27న అప్పటి ఎస్ఐ కె.రాజశేఖర్ అరెస్ట్ చేశారు. అతని వద్ద ఉన్న 1.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

రొంపిచర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చయ్యపాలెం సమీపంలో ట్రాక్టర్ తిరగబడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పుట్టా ఏడుకొండలు(54) పొలం పనులు చేసి.. ట్రాక్టర్‌పై వస్తుండగా కాలువ గట్టుపై ట్రాక్టర్ తిరగబడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామస్థులు సమాచారాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలియజేశారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడి

● అదుపులో 12 మంది నిందితులు ● 32 బైక్‌లు, నగదు స్వాధీనం

నకరికల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చీమలమర్రి, చాగల్లు గ్రామాల సరిహద్దుల్లో కోడిపందేల స్థావరంపై నకరికల్లు పోలీసులు శుక్రవారం దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ కె.సతీష్ తన సిబ్బందితో పందేలు నిర్వహిస్తున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. 32 బైక్‌లను, పది కోడి కత్తులను, రూ.20,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకతో.. పందే చూసేందుకు వచ్చిన ప్రజలు, కొందరు నిర్వాహకులు చెల్లాచెదురుగా పరుగులు తీశారు.

స్కూటీని ఢీకొట్టిన కారు.. విద్యుత్ ఉద్యోగి మృతి

బాపట్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకొని స్కూటీపై ఇంటికి వస్తున్న విద్యుత్ ఉద్యోగిని వేగంగా కారు ఢీకొట్టటంతో దుర్మరణం చెందారు. పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ వివరాల మేరకు.. బాపట్ల విద్యుత్ డివిజన్ కార్యాలయంలో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పచ్చిపులస రామసురేష్ (54) గురువారం రాత్రి ఇంటికి వస్తుండగా.. చీరాల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రామ సురేష్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడు విజయవాడ వన్‌టౌన్‌ని వాసి. బాపట్ల ఇస్లాంపేటలో నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పకడ్బందీగా వాటర్ షెడ్ మహోత్సవ్ సభ

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు(తూర్పు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ మహోత్సవ్ సభను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామంలోని చెరువును, లయోలా పాఠశాలలో జరిగే సభ ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఏర్పాట్లపై ఆలసత్వం వహించవద్దని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గామీణాభివృద్ధి శాఖకు సంబంధించి వాటర్ షెడ్ -పీఎంకేఎస్‌వై జాతీయ సదస్సు 10, 11 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 10న గుంటూరు ఐటీసీ హోటల్లో ప్రారంభ కార్యక్రమం, 11న నల్లపాడు లయోలా పాఠశాలలో జాతీయ సదస్సు జరుగుతుందని వివరించారు. సదస్సు ముందు వెంగళాయపాలెంలోని చెరువు పరిశీలన ఉంటుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ



లయోలాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ

రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జడ్పీ సీఈవో వి జ్యోతి బసు, డ్వామా పీడీ శంకర్, పశ్చిమ తహసీల్దారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోషలిజం వైపు యువత చూపు

● సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

గుంటూరు(తూర్పు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని చాలా దేశాల్లో పెట్టుబడిదారి వ్యవస్థ కూలిపోతోందని, ఈ దశలో యువత, ప్రజలు సోషలిజం పట్ల ఆకర్షితులవుతున్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. సోవియట్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అధ్యక్షతన పెట్టుబడి విధానం - భవిష్యత్తు అనే అంశంపై సభ నిర్వహించారు. ముఖ్య వక్తగా రాఘవులు మాట్లాడుతూ సోషలిజాన్ని నాశనం చేసేందుకు అమెరికా కుట్ర పన్నుతోందని విమర్శించారు. పెట్టుబడిదారి విధానం శాశ్వతంగా ఉంటే ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. సోషలిజం అంటే ట్రంప్‌నకు భయమని, అయన పెట్టుబడిదారులకు ప్రతినిధిగా వ్యవహరిస్తారని ఆరోపించారు. మోదీ కూడా ట్రంప్ అడుగుజాడల్లో పయనిస్తున్నాడని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలు మోదీ విధానాలను వ్యతిరేకిస్తున్నారని, అందుకే 2024 ఎన్నికల్లో బీజేపీకి సీట్లు గణనీయంగా తగ్గాయన్నారు. ఢిల్లీలోని జవహర్, పుదుచ్చేరి విద్యాలయాల్లో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఏబీవీపీ ఘోరంగా ఓడిపోయిందని గుర్తుచేశారు. యువత, విద్యార్థులు, సోషలిజం వైపు మొగ్గుచూపుతున్నారన్నదానికి ఈ ఎన్నికలు నిదర్శనమని అన్నారు. గూగుల్ లాంటి సంస్థలతో సమాచారం తెలుస్తుందే తప్ప ఆశించిన ఉద్యోగాలు రావన్నారు. వైజాగ్‌లో ఏర్పాటు



మాట్లాడుతున్న బీవీ రాఘవులు, కేఎస్ లక్ష్మణరావు, బాబురావు

చేసే గూగుల్ సెంటర్‌తో కేవలం 300 ఉద్యోగాలు మాత్రమే వస్తాయన్నారు. అదే విశాఖ ఉక్కు పరిశ్రమ ద్వారా 30వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు. పైగా గూగుల్ సెంటర్‌తో భవిష్యత్తులో వైజాగ్ వాసులకు నీరు, విద్యుత్ కష్టాలు వస్తాయని అన్నారు. పైగా ప్రజలకు డాలర్‌పై పూర్తిగా నమ్మకం పోయిందని, అందుకే చాల మంది చైనా కరెన్సీ యువాన్‌ను ప్రతి ఒక్కరూ దాచుకుంటున్నారని తెలిపారు. చైనాలో తయారు చేస్తున్న వస్తువులు ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ అవుతున్నాయని, ఆ దేశం శాస్త్ర సాంకేతికంగా ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, పాశం రామారావు, ఈమని అప్పారావు, నళినికాంత్, భావన్నారాయణ, అరుణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్య

● చర్యలు తీసుకోవాలంటూ బంధువుల నిరసన

రెంటచింతల, గురజాల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంగారపు ఉంగరం అపహరణ చేశారంటూ.. ఇంటి దగ్గరకొచ్చి దుర్భాషలాడడాన్ని అవమానంగా భావించి గడ్డి మందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రెంటచింతలలోని అంబేడ్కర్ కాలనిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగార్జున వివరాల మేరకు.. కొత్తపల్లి వాణి(36) అనే మహిళ ఆడేపు సరిత గృహంలో చోరీ చేసింది. దీనిపై కుల పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఆ ఉంగరాన్ని ఎక్కడ విక్రయించావంటూ వాణిని నిలదీయడంతో అవమానంగా భావించి.. ఈ నెల 4న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం పిడుగురాళ్లలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యకు కారణమైన దోషులపై చర్యలు తీసుకోవాలంటూ గురజాల పట్టణంలోని బ్రహ్మనాయుడు సెంటర్‌లో వాణి మృతదేహంతో బంధువు నిరసన తెలిపి.. రాస్తారోకో చేశారు. కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, పలువురు ఎస్ఐలు వారికి సర్దిచెప్పడంతో నిరసనను విరమించారు. మృతురాలికి ముగ్గురు సంతానం, భర్త ప్రేమ్‌కుమార్ పదేళ్ల కిందట మృతి చెందాడు. మృతురాలి తమ్ముడు దేగల చిన్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి

మేడికొండూరు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒక లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం మేడికొండూరు మండలం జంగంగుంటపాలెం సమీపంలో శుక్రవారం జరిగింది. మేడికొండూరు సీఐ ఖాజీబాబు కథనం మేరకు.. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం బొల్లవరం గ్రామానికి చెందిన డ్రైవర్ కాలే ప్రసాద్(23) సాతులూరు నుంచి పేరేచర్ల మీదుగా సత్తెనపల్లి వైపు లారీని తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు ఆధారంగా మేడికొండూరు ఎస్ఐ ఖాజీబాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

21 నుంచి రాజధాని గ్రామాల అభివృద్ధి పనులు

● 29 గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీలు, వీధి దీపాల ఏర్పాటు

● పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టీకరణ

గుంటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు ఈ నెల 21 నుంచి ప్రారంభించనున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ శుక్రవారం తెలిపారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రాజధానిలోని 29 గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడంతోపాటు అన్ని గ్రామాలకు తాగునీటి సదుపాయాలు కల్పిస్తామని, వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కాగా రాజధాని అమరావతికి భూసమీకరణ ద్వారా భూములిచ్చేందుకు రైతులు ముందుకొచ్చిన నేపథ్యంలో రాజధానితోపాటు, వారు నివసించే గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తామని అప్పట్లో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు ఈ ఏడాది రాజధాని గ్రామాల మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 904 కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ మొత్తాన్ని ఇప్పుడు ఖర్చు చేసి రాజధాని గ్రామాల రూపు రేఖలను ప్రభుత్వం మార్చబోతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తి వందేమాతరం

గుంటూరు సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశభక్తి భావంతో పాటు స్వాతంత్ర ఉద్యమంలో స్ఫూర్తిగా వందేమాతర గీతం నిలిచిందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. వందేమాతరం గితం రచించి 150 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సమావేశానికి ఏఓ రత్నబాబు అధ్యక్షత వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, బకిమ్ చంద్ర చటర్జీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఛైర్‌పర్సన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ స్వాతంత్ర్య సమరంలో వందేమాతరగితానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. సీఈఓ వీర్ల జ్యోతి బస్సు మాట్లాడుతూ జాతిని ఏకతాటిపైకి తెచ్చి ప్రజల్లో దేశభక్తి భావాన్ని వందేమాతర గీతం పెంపొందించిందని అన్నారు. ఇది ప్రజలకు మంచి ప్రేరణగా నిలిచిందన్నారు. సమావేశంలో అకౌంట్స్ ఆఫీసర్ సామ్యూల్ పాల్, జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్, సీఈఓ

సైన్స్ ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలి

ఏఎన్‌యూ నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని ఎస్‌ఈఆర్టీ సంచాలకులు ఎంవీకృష్ణారెడ్డి కోరారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ, ఏపీఎస్‌ఈఆర్ ఆధ్వర్యంలో ఏఎన్‌యూలో శుక్రవారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులు సైన్స్ రంగంపై పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి సుమారుగా 230 మంది విద్యార్థులు, 50 మంది గైడ్ అధ్యాపకులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బృందాలు ఈ నెల 20, 21న బెంగళూరులో జరిగే సౌత్ ఇండియా సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొంటారని నోడల్ అధికారి ఆచార్య ఎస్.వి.నాగమణి చెప్పారు. విజేతలకు సంచాలకులు కృష్ణారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం అధ్యాపకుడు భూషణ్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న సంచాలకులు కృష్ణారెడ్డి

దేశభక్తి జ్వాలలు రగిల్చిన వందేమాతరం

వందేమాతరం గీతం స్వాతంత్రోద్యమంలో ప్రజల గుండెల్లో దేశభక్తి జ్వాలలు రగిల్చిందని డాక్టర్ బీ.ఆర్.ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఏఎన్‌యూలోని ఆచార్య హరగోపాల్‌రెడ్డి సెమినార్ హల్ చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వందేమాతరంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మహోన్నత గేయాన్ని మహాకవి బంకిమ్ చంద్రచటర్జీ 1875 నవంబరు 7న రచించారని తెలిపారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ వందేమాతరానికి 150 ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. విభాగాధిపతి ఆచార్య ఎస్.మురళీమోహన్ అధ్యక్షత వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్ పరీక్ష ఫలితాలు విడుదల

ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ మొదటి మూడు నాలుగు సెమిస్టర్ల రీవాల్యుయేషన్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు.

45,026 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 38,186 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,026 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,564 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	16000
నెంబరు. 5	10000	14300
273	---	---
341	10000	16800
4884	---	----
సూపర్ 10	----	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16700
దేవనూరు డీలక్స్	10000	15700

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	13500
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16000
నెంబరు. 5	10000	14500
273	---	----
341	10000	17000
4884	11000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15500
బ్యాడిగి	10000	16300
దేవనూరు డీలక్స్	10500	15500
తాలుకాయలు	5000	8700

డిసెంబరు 9 వరకు 279 ఎల్‌సీ గేటు మూసివేత

గుంటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట - మునమాక రైల్వే స్టేషన్ల మధ్యన ఆర్‌యూబీ నంబరు 279 వద్ద ఉన్న లెవల్ క్రాసింగ్ గేటుని ఈ నెల 10 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు మూసేస్తున్నట్లు రైల్వే ప్రజా సంబంధాల అధికారి వినయ్‌కాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తనపల్లి వెళ్లే రహదారి పునరుద్ధరణ పనులు వర్షాల కారణంగా ఆలస్యం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా ఎల్‌సీ నంబరు 276 ద్వారా ప్రయాణించాలని సూచించారు.

ఎన్జీ రంగా.. అందరికీ ఆదర్శం

(5వ పేజీ తరువాయి)

పెట్టినట్లు గుర్తుచేశారు. 33 ఏళ్ల వయసులోనే ఆయన రైతుల ఉద్యమాన్ని ముందుండి నడిపించారన్నారు. 1964లో 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రసంగించి రైతు భూమిని కట్టడి చేసే చట్టాన్ని ఆయన అడ్డుకున్నారన్నారు. 50 ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా చేసిన సేవలకు గిన్నీస్ వరల్డ్ రికార్డులకు ఎక్కడం అరుదైన గౌరవమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని, రైతుకు ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గి ఉత్పత్తి పెరగాలన్నారు.

సమర్థ నిర్వహణతోనే నీటి భద్రత

సమర్థ నీటి నిర్వహణ, ముందస్తు చర్యల వల్ల రిజర్వాయర్లు 95 శాతం నిండాయన్నారు. గత ప్రభుత్వంలో రిజర్వాయర్ల గేట్లను కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. డ్రిప్ ఇరిగేషన్‌లో ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, మిగిలిన వారికి 50 నుంచి 90 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పిడి చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, పంటలకు సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. అనంతరం ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు అనే పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నసీర్ అహ్మద్, గళ్ళా మాధవి, వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ వీవీ సత్యనారాయణ, శాస్త్రవేత్త కుర్రా శ్రీనివాసబాబు, ఎన్జీ రంగా ట్రస్ట్ సభ్యులు రామినేని కిశోర్‌బాబు, టి.యుగంధర్, బి. నాగేశ్వర్‌మిత్రా, ఆదర్శ రైతు కుంచాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ 'పెండింగ్'?

(5వ పేజీ తరువాయి)

పనులు జరుగుతుంటాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను ఫీల్డు అసిస్టెంట్లుగా నియమించుకోవడం అనవాయితీ. రాజకీయ అండదండలు, అధికారుల సహకారంతో ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నా చర్యలు శూన్యంగా ఉంటున్నాయి. ఈకేవైసీ, ఎన్‌ఎంఎంఎస్‌ను అమల్లోకి తీసుకురావడంతో బోగస్ జాబ్ కార్డులకు కూడా చెక్ పెట్టినట్లయింది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రైవేట్ ఉద్యోగుల పేర్లపై జాబ్ కార్డులు సృష్టించి వేతనం కొట్టేస్తున్న ఉదంతాలు కోకోల్లలు. పనికి రాకుండానే రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ఉపాధి కార్మికుని పేరుతో వేతనాలు చెల్లించడం పెద్దఎత్తున జరుగుతోంది. ఏటా రూ కోట్లలో ఉపాధి నిధులను కొందరు అధికా రులు.. ఫీల్డ్ అసిస్టెంట్లు పంచుకుతింటున్న ఉదంతాలు సామాజిక తనిఖీలో వెలుగు చూసినా.. వారిపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. కొట్టేసిన సోమ్మును రికవరీలు కూడా ఉండటం లేదు. నూతన హాజరు విధానంతో కొంత మేర అక్రమాలను అరికట్టే అవకాశం ఉంది.

తుఫాన్ సాయం.. గందరగోళం

(5వ పేజీ తరువాయి)

సివిల్ సప్లయిస్, రెవెన్యూ విభాగానిది. కానీ క్షేత్రస్థాయిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరించడంతో తుఫాన్ బాధితులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోజువారీ పంపిణీ ఎన్ని కుటుంబాలకు జరిగింది, ఇంకా ఎన్ని కుటుంబాలకు సాయం అందించాల్సి ఉందనే ప్రాథమిక సమాచారం కూడా డీఎస్‌వో వద్ద ఉండకపోవడం సమన్వయలోపాన్ని సూచిస్తోంది.

సా..గుతున్న ప్రక్రియ

తుఫాన్ ప్రభావిత కుటుంబాలను 33,750గా యంత్రాంగం లెక్క తేల్చింది. 356 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన వారి సంఖ్య 12,200 కుటుంబాలు ఉన్నాయి. వీరితో పాటు జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులు 13,000, చేనేత కుటుంబాలు 8,550 మందిని నిత్యావసరాల సాయానికి అర్హులుగా యంత్రాంగం గుర్తించింది. వీరిలో పునరావాస శిబిరాల్లో ఆశ్రయం పొందిన కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలు, మత్స్య, చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కేజీల బియ్యంతో పాటు పామాయిల్ ప్యాకెట్, ఉల్లిపాయలు కేజీ, కందిపప్పు కేజీ, పంచదార కేజీ, బంగాళాదుంపలతో కిట్ రూపంలో అన్నీ ఒకేసారి అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. పంపిణీ ప్రక్రియ మూడు రోజుల్లోనే పూర్తి కావాలని ప్రభుత్వం సూచించింది. కానీ శుక్రవారం వరకు ఎంత పంపిణీ జరిగిందనేది పౌర సరఫరాల విభాగం వద్ద స్పష్టత లేదు. బాధితులు సమీపంలోని రేషన్ షాపులో నిత్యావసరాలు అందుకునేలా మ్యాపింగ్ చేసింది. 25 మండలాల పరిధిలో 686 షాపులను ఇందుకు ఎంపిక చేసింది. మ్యానువల్‌గా కూడా డీఎస్‌వో అభ్యర్థన మేరకు మరికొన్ని దుకాణాల్లో బాధితులకు నిత్యావసరాలు అందేలా ఏర్పాట్లు చేసింది. ఈ మొత్తం ప్రక్రియ అంతా గజిబిజిగా మారింది. నిత్యావసరాలు అందుకోవడానికి బాధితులకు పోర్టబులిటీ అవకాశం కల్పించినా అది అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు. బియ్యం, పంచదార తొలుత రేషన్ డీలర్ల వద్దకు చేరాయి. తర్వాత రోజు దుంపలు, ఉల్లిపాయలు, ఇంకో రోజు కందిపప్పు, పామాయిల్ ఇలా వ్యవధి ఇస్తూ డీలర్ షాపుల వద్దకు నిత్యావసరాలు చేరాయి. నిత్యావసరాల కోసం మూడు సార్లు రేషన్ దుకాణం చుట్టూ తిరిగి థంబ్ వేసి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు బాధితుల మ్యాపింగ్ డీలర్ పరిధిలో కానీ వారు ఎక్కువగా ఉండడంతో వారికి సమాచారం చేరడం కూడా కష్టమైపోయింది. ఇదిలా ఉంటే ఇదే అదనుగా రెండు సరుకులు మాత్రమే ఇచ్చి ఆరింటికి థంబ్ వేయించుకుని పక్కదారి పట్టించిన డీలర్లూ ఉన్నారు. కార్డులు లేని కుటుంబాలకు భట్టిప్రోలు మండల పరిధిలో ఇచ్చిన సరుకులను కూడా డీలర్లు వెనక్కి తీసుకున్నారని సమాచారం.

తల్లితో గొడవ.. కూతురు ఆత్మహత్య

రేపల్లె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తల్లికూతుళ్ల మధ్య ఏర్పడిన వివాదంతో 5వ వార్డులో నివాసం ఉంటున్న గరికపాటి రమాదేవి(29) అనే మహిళ కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుందని సీఐ మల్లికార్జునరావు తెలిపారు. రమాదేవి భర్తను దూరంగా ఉంటూ.. తల్లి దగ్గరే జీవనాన్ని కొనసాగిస్తోంది. రెండు రోజులుగా తల్లికూతుళ్ల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన రమాదేవి పెనుమూడి పులిగడ్డ వారధి పైనుంచి కృష్ణా నదిలో దూకింది. దగ్గరలో ఉన్న మత్స్యకారులు ఆమెను ఒడ్డుకు చేర్చి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉరివేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి

పట్టణంలోని 25వ వార్డులో మౌంట్‌ఫోర్టు స్కూల్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడని సీఐ మల్లికార్జునరావు తెలిపారు. స్థానికులు సమాచారం అందించడంతో మృతదేహాన్ని వైద్యశాలకు తరలించామని తెలిపారు. 45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి కాఫీ గళ్ల చొక్కా వేసుకున్నాడని తెలిపారు. ఎవరైనా.. గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని చెప్పారు.

బాపట్ల వార్తలు

♦ బాపట్ల ♦ వేమూరు ♦ రేపల్లె



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్,జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ తదితర శాఖల అధికారులు

కేంద్ర బృందం పర్యటనకు రూట్ మ్యాప్ తయారు చేయాలి

● అధికారులకు సూచించిన రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటపొలాల సందర్శన, నష్టాల అంచనాలపై కేంద్ర కమిటీ బాపట్ల విచ్చేయు సందర్భంగా రూట్ మ్యాప్ తయారు చేయాలని రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. సచివాలయం నుంచి కలెక్టర్‌తో శుక్రవారం జూమ్ సమావేశం నిర్వహించారు. బాపట్ల నుంచి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు, రోడ్లు, బ్రిడ్జీలు సందర్శించి నష్టాల అంచనా వేసేందుకు ఈనెల 10న కేంద్రకమిటి జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో బాపట్ల, ప్రకాశం జిల్లాలో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు, రోడ్లు, బ్రిడ్జీలకు సంబంధించిన ఛాయచిత్ర ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. చీరాల బీచ్‌రోడ్డులో దెబ్బతిన్న పంచాయతీరాజ్‌రోడ్డు, ఇళ్ళు, చీరాల, చినగంజాంలో దెబ్బతిన్న వరి పొలాల సందర్శనకు రూట్‌మ్యాప్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, అన్నిమండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

గర్భస్థ లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో పి.గ్లోరియా

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గర్భస్థ లింగనిర్ధారణ నేరమని, అలాంటి చర్యలకు పాల్పడితే పీసీపీఎన్‌డీటీ చట్టప్రకారం చర్యలు తప్పవని ఆర్డీవో పి.గ్లోరియా హెచ్చరించారు. ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం పీసీపీఎన్‌డీటీ బాపట్ల సబ్ డివిజన్ స్థాయి మల్టీమెంబరు అప్రొపరేటివ్ అథారిటీ, సబ్ డిస్ట్రిక్ లెవెల్ అడ్వయిజర్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ జి.రామాంజనేయులు, డాక్టర్ బ్రహ్మం, డాక్టర్ శాంతి వైష్ణవి, డాక్టర్ సౌజన్య, డాక్టర్ సుష్మా, ఎన్జీవోలు పి.ప్రసాదరావు, మహ్మద్‌ఖాన్, డిప్యూటీ డెమో బి.మరియమ్మ తదితరులుపాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సేవలందించగలం

● పోలీసు అధికారులకు సూచించిన ఎస్పీ బి.ఉమామహేశ్వర్



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలందించగలరని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. పట్టణంలోని ఎంఎస్‌ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా మెగా వైద్య శిబిరంలో ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఇతర ప్రభుత్వశాఖల విధులతో పోలిస్తే పోలీసుశాఖ విధులు కఠినంగా ఉంటాయని తెలిపారు. అందుకే పోలీసుశాఖ ఆధ్వర్యంలో రమేష్ హాస్పిటల్ బృందం సహకారంతో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అనంతరం స్వయంగా వైద్యపరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో డీఎస్పీ జి.రామాంజనేయులు, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారధి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ మౌలుద్దీన్, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ కిరీటి, మధుప్రియ, రోషన్, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంతో జీవితం అంధకారం

● సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ వినియోగం వల్ల జీవితం అంధకారమౌతుందని సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్ తెలిపారు. బాపట్ల లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో ఈగల్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయికి సంబంధించి కలిగే అనర్థాలు, గంజాయి కేసుల శిక్షల గురించి తెలియజేశారు. అందరిచేత డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదం చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్స్ గురించి కూడా అవగాహన కల్పించారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

పిట్టలవానిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటిపన్ను వసూళ్ళు వేగవంతం చేయాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేకాధికారి సీహెచ్ విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాలలో స్వామిత్వ కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సర్వేలు సకాలంలో పూర్తి చేయని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శేఖర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల ఆఖరిలోపు ఇంటిపన్నుల వసూళ్ళను పూర్తి చేయాలని డీఎల్‌డీవో సీహెచ్ విజయలక్ష్మి అన్నారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లు, కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటిపన్నులు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిగేవిధంగా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో ఐనంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుండివారిపాలెంలో ఇసుక అక్రమ తవ్వకాలు



ఇసుక తవ్వుతున్న వారితో మాట్లాడుతున్న ఆర్‌ఐ మాధవ కిరణ్

కర్లపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుండివారిపాలెం పంచాయతీలో గురువారం అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా ఎక్స్‌కవేటర్, 10 ట్రాక్టర్ ట్రక్కులతో ఇసుకను తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించటంతో ఆర్‌ఐ మాధవ్ కిరణ్, వీఆర్వో యశ్వంతితో సంఘటన స్థలానికి చేరుకొని మద్దాల రాముల పొలంలో ఇసుకను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, నిర్వాహకుడు కోటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ షాకీర్‌పాషా, ఆర్‌ఐ మాధవకిరణ్‌లు ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి భద్రత కొరకు కర్లపాలెం ఎస్సై రవీంద్రకు అప్పగించారు. ఇదిలా ఉండగా గత మార్చి 19న అక్రమ మైనింగ్‌తె 25 అడుగుల మేర ఇసుకను తవ్వి గుంతలు వదిలివేయగా తన 15 సంవత్సరాల కుమారుడు ఉన్నం ప్రవీణ్ క్వారీలో పడి మరణించాడని యాజలికి చెందిన తల్లిదండ్రులు శుక్రవారం తహసీల్దార్ షాకీర్ పాషాకు ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్ జరుపుతున్న వారిపై చర్యలు చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు.

ఎన్జీ రంగా సేవలు అమూల్యమైనవి

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



ఆచార్య ఎన్జీ రంగా విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, గ్రామ నాయకులు

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్జీరంగా రైతుల కోసం చేసిన సేవలు అమూల్యమైనవని ఎంపీ, లోకసభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఎన్జీరంగా 125వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఎన్జీరంగా విగ్రహానికి, స్థూపానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతులకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు సి.హెచ్ అమర్‌నాథ్, డీసీ చైర్మన్ ఇనగంటి శ్రీకాంత్, సొసైటీ చైర్మన్ అచంట విజయ్, గ్రామపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● భారతీయ గ్రామీణ రైతుల ఆర్థిక పరిస్థితులపై విస్తృత పరిశోధనలు చేసి రైతులు, రైతుకూలీల ఆర్థికాభివృద్ధికై ఆచార్య ఎన్జీరంగా విశేష కృషి చేశారని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసూనారాణి తెలిపారు. ఎన్జీరంగా 125వ జయంతి కార్యక్రమాన్ని బాపట్ల వ్యవసాయ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ బి.రవీంద్రరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ జి.విజయ్‌కుమార్, డాక్టర్ ఎస్.ఆర్.కోటేశ్వరరావు, డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ జయలలిత, డాక్టర్ శ్రీలేఖ, డాక్టర్ ఎం.రమాదేవి పాల్గొని ఎన్జీరంగా సేవలను కొనియాడారు.

● రైతు ఉద్యమాలలో కీలకపాత్ర పోషించి వ్యవసాయానికి సంబంధించిన రంగంలో విశేష కృషి చేసిన అచార్య ఎన్జీరంగా సేవలు చిరస్మరణీయమని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఎన్జీరంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేట్ డీన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎన్జీరంగా చేసిన కృషిని గుర్తించి భారత ప్రభుత్వం రైతు అవార్డును ఆయన పేరిట ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ కేవీఎస్ రామిరెడ్డి, డాక్టర్ బి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్, డాక్టర్ డి.విజయ్‌కుమార్, డాక్టర్ బి.రాజ్‌కిరణ్, డాక్టర్ కె.కృపావతి, వి.పద్మతులసీ తదితరులు పాల్గొన్నారు.

● డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో శుక్రవారం ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ బేగ్, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నివేదిత, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వందేమాతరం స్ఫూర్తితో యువత నడుచుకోవాలి

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్



సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గేయం మనందరిది ఒకే జాతిగా, ఒకే దేశమనే సంకల్పంతో నడిపించే శక్తి అని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని ఎంఎస్‌ఆర్ కల్యాణ మండపంలో వందేమాతరం మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గేయరచయిత బంకించంద్ర ఛటర్జీ పటానికి పుష్పాంజలి ఘటించి విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి గేయాన్ని ఆలపించారు. ఎస్పీ మాట్లాడుతూ దేశం అనేది కేవలం భూమికాదు తల్లితో సమానమైన భావజాలాన్ని ఈ గేయం ప్రతిబింబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌డిఎస్పీ పి.ఉదయసారధి, అడ్మిన్ ఆర్‌ఐ మౌలుద్దీన్, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● స్వదేశీ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు తెలిపారు. వందేమాతరం రచనకు 150 సంవత్సరాలైన సందర్భంగా బాపట్ల లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బంగారుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని వందేమాతరం విశిష్ఠతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్రా వెంకట రామకృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

● వందేమాతరం గేయం 150 వసంతాల వేడుకలు శుక్రవారం బాపట్లలోని విజయలక్ష్మీపురం మాజీ సైనిక సంక్షేమ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను అవిష్కరించి వందేమాతరం గేయం ఆలపించి గౌరవవందనం చేశారు. ఆయన మాట్లాడుతూ బంకించంద్ర ఛటర్జీ రచించిన ఈ గేయం స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో ఉపయోగపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి షేక్ మొయినుద్దీన్, సుంకర శేషగిరిరావు, బి.వెంకటేశ్వర్లు, కోకి ధర్మారెడ్డిపాల్గొన్నారు.

● కర్లపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం సచివాలయం వద్ద శుక్రవారం కూటమి నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో నల్లమోతువారిపాలెం యూనిట్ ఇన్‌చార్జి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాడా శ్రీనివాసరావు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు గరిగంటి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం,, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వదేశీ స్ఫూర్తిని పెంపొందించే అవగాహన కార్యక్రమాన్ని చందోలు లింగోద్భవస్వామివారి దేవస్థాన పాలకమండలి చైర్మన్ పరిమి రామకృష్ణసాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిశా శ్రీనివాస్, ఉపాధ్యాయులు శారద, షేక్ కరీముల్లా, ఆదినారాయణ సమక్షంలో విద్యార్థులకు 150 ఏళ్ళ వందేమాతరం గీతం చరిత్రను వివరించారు.

సరుకుల రవాణా వాహనాలలో ప్రయాణించరాదు : ఎస్‌ఐ

పిట్టలవానిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సరుకులు రవాణ చేసే వాహనాలలో ప్రయాణికులు ప్రయాణం చేయటం అత్యంత ప్రమాదకరమని చందోలు ఎస్‌ఐ ఎం.వెంకటశివకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్‌లలో ప్రయాణం చేయకుండా రైలు, ఆర్టీసి బస్సుల ద్వారా ప్రయాణం సురక్షితమని తెలియజేశారు. చందోలు జాతీయరహదారిలోని టోల్‌ప్లాజా వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు. అలాగే ఖాజీపాలెం గ్రామంలో శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై, సైబర్ నేరాలపై ప్రజలకు ఎస్‌ఐ అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు ప్రొడిజి విద్యార్థి ఎంపిక

బాపట్లరూరల్,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలలో విశిష్ట ప్రతిభ కనబరిచి నక్కల కౌశిక్ బంగారు పతకం సాధించి ప్రొడిజి విద్యాలయం మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చాడని ప్రిన్సిపాల్ బ్రజేష్ కానూన్గో అన్నారు. కౌశిక్‌కు బంగారు పతకాన్ని మెమొంటోను యోగా గురూజి రామస్వామి, మల్లిఖార్జున్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసురెడ్డి అందజేసి అభినందించారు. విద్యాలయంలో శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థిని డైరెక్టర్‌లు ఎం.శ్రీనివాసరావు, పార్థసారథి, పెదమల్లు ఉదయచంద్రరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం

వేమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అబ్బనగూడవలి గ్రామంలో ఎంతో కాలం నుంచి మురుగు కాల్వల పూడికతీతలు తీయని కారణంగా మురుగు సమస్యతో గ్రామస్థులు రోగాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎక్స్‌కవేటర్ సాయంతో మురుగు కాల్వల పూడికలు తీయించి పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు దోమల నివారణకు మందును పిచికారీ చేయించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు గ్రామస్థులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

పెళ్లి కుమార్తె కుటుంబానికి ఆర్థికసాయం

పిట్టలవానిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు సయ్యద్ నిజాం ముస్లిం కుటుంబంలోని వివాహానికి ఆర్థికసాయం అందజేశారు. చందోలు గ్రామంలోని రసూల్‌పేటకు చెందిన ఖలీల్ కుమార్తె వివాహానికి తన స్నేహితులతో కలిసి ఆర్థికసాయం అందజేశారు. పెండికుమార్తె కుటుంబ సభ్యులు నిజాంను అభినందించారు. ఈ కార్యక్రమంలో అరీఫ్, ఖాదర్, జమీర్, సైదా, అలాం, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ తనిఖీ

చెరుకుపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : బీఎస్‌ఎన్‌ఎల్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా శుక్రవారం నడింపల్లిలో ఒంగోలు, గుంటూరు జిల్లాల జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్, డీజీఎం పి.వెంకటేశ్వరరావు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఏజీఎం బి.భాస్కర్, రేపల్లె జేటీవో అప్పారావు, నీటిసంఘాల అధ్యక్షుడు గోగినేని రామాంజనేయవరప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొల్లూరు, చెరుకుపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం కొల్లూరు మండల పరిధిలో, చెరుకుపల్లి, గూడవల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ పోతురాజు ఒక ప్రకటనలో కోరారు.

తిప్పలకట్టలో పశు వైద్య శిబిరం

కొల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని రాష్ట్ర పశు శాఖ అధికారులు నిర్వహించారు. మండల పరిధిలోని తిప్పలకట్ట గ్రామంలో జువ్వపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ షబీనా సుల్తానా షేక్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన పశు వైద్య శిబిరంలో పశు గణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి చల్లా చలపతిరావు పాల్గొని 76 పశువులకు గర్భకోశ సంబంధిత సమస్యలకు చికిత్స అందించారు. 32 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువుల్లో అంతర, బాహ్య పరాన్న జీవుల నిర్మూలన కోసం మినరల్ మిక్చర్ ప్యాకెట్లు తదితర మందులను పశు పోషకులకు అందజేశారు. తిరుపతిరావు మాట్లాడుతూ, దూడల పోషణ యాజమాన్యం, నట్టల నివారణ, టీకాల ప్రాముఖ్యతతో పాటు పశువుల్లో ఏర్పడే గర్భకోశ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. శిబిరంలో సర్పంచ్ గుర్రం నాగమల్లేశ్వరరావు, పశువైద్యాధికారులు రోషన్‌బేగ్, యశ్వంత్ శిబిరంలో వైద్యసేవలు అందించారు. పశు వైద్య సిబ్బంది పద్మావతి, ఆదినారాయణ, పావని కామాక్షి, జగదీష్, దేవీశ్రీకాంత్, పద్మజ, జ్యోతి పాల్గొన్నారు.

పెనుగుదురుపాడులో....

చుండూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు ద్వారా తోడ్పాటు అందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షులు తమ్మా శివారెడ్డి తెలిపారు. గ్రామ సర్పంచ్ రుద్రపాటి శోభారాణితో కలిసి శుక్రవారం ఆయన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మేలుజాతి పశు సంపద వృద్ధి కోసం పెయ్యదూడలు పుట్టే లింగ నిర్ధారణ వీర్యాన్ని ప్రభుత్వం రూ.500 నుంచి రూ.150కి తగ్గించిందన్నారు. గేదెజాతి పశువుల పునరుత్పత్తికి శీతాకాలం అనుకూలంగా ఉంటుందని రైతులు ఎద లక్షణాలు గుర్తించి కృత్రిమ గర్భోత్పత్తి చేయించాలని డాక్టర్ వై.సుధాకర్ తెలిపారు. శిబిరంలో 60 పశువులను పరీక్షించి మినరల్ మిక్చర్, లివర్ టానిక్స్ మందులు పంపిణీ చేశారు. డాక్టర్ అపర్ణ, డాక్టర్ చినమునియ్య, ఫరీద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కావూరు జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

చెరుకుపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.దివ్య వకృత్వం, క్విజ్ పోటీలలో నియోజకవర్గంలో ప్రథమస్థానాన్ని సాధించగా వ్యాసరచనలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని పి.ప్రసన్న మొదటిస్థానాన్ని కైవసం చేసుకుంది. ఎమ్మెస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.శశాంక్‌గౌడ్ ద్వితీయస్థానంలో నిలిచాడు. విజేతలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జీకే జుబేర్, కళాశాల ప్రిన్సిపాల్ కోదండరాం, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించారు.

వెల్లటూరు జడ్పీహెచ్‌లో మాక్ అసెంబ్లీ

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. వెల్లటూరు జడ్పీహెచ్‌ఎస్‌లో దేశ ప్రధాని నరేంద్రమోదీ జీఎస్‌టి 2.0 తో నూతనంగా పన్నులలో వెసులుబాటు కల్పించడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని హెచ్‌ఎం కె.అరుణకుమారి శుక్రవారం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేధ ప్రజలకు ఉపయోగపడాలని గూగుల్ సంస్థతో చేసుకున్న ఒప్పందం వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు రాష్ట్రం సాంకేతికంగా అభివృద్ధి చెందుతుందని మాక్ అసెంబ్లీలో కళ్లకు కట్టినట్లుగా విద్యార్థులు వివరించారు. అనేక అంశాల మీద విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్ శిక్షణ ఇచ్చినట్లుగా హెచ్‌ఎం తెలిపారు. మాక్ అసెంబ్లీ నిర్వహణలో నక్కా వెంకటేశ్వర్లు, కుటుంబరావు, ఎస్టేట్‌బాబు, శివరామకృష్ణ, బేబి, పద్మ, శ్రీలక్ష్మి, రాణి పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ లీగల్ సెల్ అధికారి ప్రతినిధి వేల్పుల జయప్రకాష్ తండ్రి చిన్నసోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం జంపనిలో వారి స్వగృహానికి వెళ్లి జయప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించారు. చిన్న సోమయ్య మృతికి నివాళులు తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వెలిబుచ్చారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రవి ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ గవిని లక్ష్మిదుర్గ, టీడీపీ సీనియర్ నాయకుడు వట్టిప్రోలు యోబు, బీసీ సంఘ నాయకులు పల్లా వాసుయాదవ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు కొడాలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



జంపనిలో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

జీవనశైలి మార్పుతో క్యాన్సర్ వ్యాధి నివారణ : జేసీ



క్యాన్సర్ అవగాహన శిబిరంలో ప్రసంగిస్తున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

చెరుకుపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం కావూరు బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవనశైలిని మార్చుకుంటే కొంతవరకు క్యాన్సర్ నివారించవచ్చు అన్నారు. డీఎంహెచ్‌వో విజయలక్ష్మి మాట్లాడుతూ క్యాన్సర్‌పై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించడం వల్ల వారు దీనిపై ఇతరులకు కూడా అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్, తహసీల్దార్, సీహెచ్ పద్మావతి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసన్, టీడీపీ మండల అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, కావూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మండవ తాతాజీ, పీహెచ్‌సీ డాక్టర్లు సమద్, సాలెనా జబీర్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

● కర్లపాలెం : క్యాన్సర్ రావటానికి గల కారణాలు, రాకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయంపై ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ సిద్దార్థ విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాఖ పేరలిలో స్కూల్ విద్యార్థులకు డాక్టర్ సిద్దార్థ ఆధునికి చికిత్స పద్దతులు, మొదలైన వాటి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పేరలి ఎంఎల్‌హెచ్ పి.ప్రియాంక, ఆషాలు, ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు) : జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిర్వహించారు. మండల పరిధిలోని ఐలవరం గ్రామంలో తొలుత వందేమాతరం గీతరచన 150 సంవత్సరాలు పూర్తి కావడంతో స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు శుక్రవారం వందేమాతరం గీతాలాపన చేశారు. అనంతరం ఎన్‌సీసీ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహనరావు, ఎన్‌సీసీ అధికారి కె.దాదిమ్మ, తాండవకృష్ణ, పడమటిబాబు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. పల్లెకోన ఎంపీపీ (నార్త్) పాఠశాలలో వందేమాతరం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ తిరుపతిబాబు విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాలాపనలో పాల్గొన్నారు.

● చుండూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ ముప్పు నివారణకు ముందస్తు పరీక్షలతో సకాలంలో దానిని నివారించుకోవచ్చునని వేటపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎం.కృష్ణవేణి అన్నారు. జాతీయ క్యాన్సర్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేటపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా వ్యాధిని గుర్తిస్తే సమగ్ర చికిత్సలతో దీనిని పూర్తిగా నివారించవచ్చునని తెలిపారు. ర్యాలీలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం



అర్జీలను స్వీకరిస్తున్న జీవీ నాగేశ్వరరావు తదితరులు

రేపల్లె, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యుడు జీవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమిప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తుందన్నారు. మొత్తం 30 ఫిర్యాదులు అందాయని, వాటిల్లో 15 ఫిర్యాదులు నివేశన స్థలాల కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతులు భూసమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను, మత్స్యకారులను ఆదుకోవాలని కొన్ని ఫిర్యాదులు అందాయన్నారు. వాటన్నింటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా సూర్యరాజు, బీజేపీ నాయకులు మాణిక్యారావు తదితరులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలపై తగిన చర్యలు తీసుకుంటాం : డీఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

చెరుకుపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం రేపల్లె డీఎస్పీ అవుల శ్రీనివాసరావు చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న బైకులు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెరుకుపల్లి మండలంలో జరుగుతున్న వరుస దొంగతనాలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పాతనేరస్తులను విచారిస్తామన్నారు. అలాగే చెరుకుపల్లిలో ప్రధాన సమస్యగా ఉన్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ప్రయత్నిస్తామన్నారు. మద్యం సేవించి, రేస్ డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ టి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం

చెరుకుపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌కారణంగా పునరావాస కేంద్రాలకు తరలించిన కావూరులోని కాలువ కట్టపై ఉన్న గిరిజన కుటుంబాలకు శుక్రవారం జేసీ భావనవశిష్ఠ నగదుసాయం అందించారు. మొత్తం 35 కుటుంబాలలోని 70 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున సాయం అందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, కావూరుపీఎస్ఎస్ అధ్యక్షుడు మండవ తాతాజీ, టీడీపీ నాయకులు చెల్లిరవికుమార్ పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు) : మత్స్యకారులకు నిత్యవసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని పల్లెకోన గ్రామంలో మొంథా తుపాన్ వల్ల జీవనభృతి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం సరఫరా చేసిన నిత్యవసర సరుకులు రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయన ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రావూరి ప్రసాద్, మాజీ ఎంపీపీ వేజళ్ల సతీష్, ఎంపీటీసీ దున్నా తిరుపతిబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మత్స్యకార సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బడి నుంచే భవితకు భరోసా!

- పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యా కోర్సులు
- పల్నాడు జిల్లాలో 66 ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ
- సర్వశిక్ష ఆధ్వర్యంలో పర్యవేక్షణ
- 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అమలు..

నరసరావుపేట రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో చదువు ఒక్కటే ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు చదువుతో పాటుగా వృత్తి విద్యా కోర్సులు నేర్పించాలని దృఢ ంగా సంకల్పించారు. వృత్తి విద్యా కోర్సులు.. ఉన్నత చదువులకు ఉపయోగపడటంతో పాటు.. స్వయం ఉపాధికీ తోడ్పడతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు ప్రాధాన్యమిస్తూ.. వృత్తి విద్యా కోర్సులకు అవసరమైన వసతులు, పరికరాలు, శిక్షకులను ఏర్పాటు చేసింది.

పల్నాడు జిల్లాలో 66 పాఠశాలల్లో అమలు

సమగ్ర శిక్ష సమాచారం మేరకు.. పల్నాడు జిల్లాలో వివిధ రకాల 66 పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు అమలు చేస్తున్నారు. ఇందులో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు -13, ఏపీ మోడల్ స్కూల్స్ -14, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు -5, వినుకొండ ప్రభుత్వ పాఠశాల, నరసరావుపేట మున్సిపల్ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలు-32 ఉన్నాయి. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉపాధి అవకాశాలు పొందే పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయురాలు

ఈ కోర్సులు ఉపాధికి ఉపయుక్తం

బాలబాలికల జీవన ప్రయాణానికి వృత్తి విద్యా కోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ.. అన్ని విధాలా సహకరిస్తోంది. కోర్సుల నిర్వహణకు అవసరమైన పరికరాలు సరఫరా చేస్తోంది. చదువు పూర్తయ్యే సరికి ఈ కోర్సులు పూర్తి చేసుకుని ధ్రువీకరణ పత్రాలను విద్యార్థులు పొందుతారు. వీటి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

- రేవతి, జీసీడీవో సమగ్రశిక్ష, పల్నాడు జిల్లా

పది కోర్సులు 125 మంది శిక్షకులు

పది రకాల కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. ఇందులో ఆటోమోటివ్, అపెరల్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, రిటైల్ వ్యాపారం, ఎలక్ట్రానిక్స్ హెల్త్‌కేర్, ఐటీ, ఆహారశుద్ధి, వీఎఫ్ఎస్ఐ, వ్యవసాయ అంశాలతో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఈ కోర్సుల్లో నైపుణ్యాలు పెంచేందుకు 125 మందిని ప్రత్యేక శిక్షకులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 12వేల నుంచి 14 వేల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. సమగ్రశిక్ష పర్యవేక్షణ చేస్తోంది. ఒక్కో ట్రేడ్‌లో శిక్షకులకు ప్రాక్టికల్స్ రవాణా, భోజన సదుపాయాల కింద రూ.10 వేలు ప్రభుత్వం అందిస్తోంది.

మహిళలకు బ్యూటీ కోర్సులు

బాలికలకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ వొకేషనల్ కోర్సుతో ఎంతో ఉపయోగం ఉంది. ఈ కోర్సు నేర్చుకుంటే బాలికలు నివశించే పరిసరాల్లోనే బ్యూటీపార్లర్, లేడీస్ కార్నర్, ఫ్యాన్సీ షాపులు పెట్టుకుని ఉపాధి పొందవచ్చు. పైగా ఇంట్లోనే ఉంటూ వీటిని నడుపుకోవడానికి అవకాశం ఉంటుంది. అందుకే ఈ కోర్సుపట్ల బాలికలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

క్రీడల్లో పతకాలు సాధించాలి

ఖోఖో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో జీవీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. సెకండరీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, 17 బాలబాలికల ఖోఖో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ఎంపిక పోటీలను స్థానిక లయోలా స్కూల్‌లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఓటమిని అంగీకరించే సాహసంతో పాటు గెలుపులో వినయం, స్నేహ భావం కలిగి ఉండాలన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ముందు అశ్విత నృత్య ప్రదర్శన క్రీడాకారులను ఆకట్టుకుంది. అనంతరం జీవీ క్రీడాకారులతో ఖోఖో ఆడి ఉత్సాహాన్ని నింపారు.

ఆడుదాం.. అంటూ దోపిడీ

ఆడుదాం ఆంధ్ర పేరుతో గత వైసీపీ ప్రభుత్వం రూ.వందల కోట్లను దోచుకుందని జీవీ ఆరోపించారు. చాలా కాలంగా ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 854 పీఈటీ పోస్టుల నియామకం చేపట్టిన ఘనత ఎన్‌డీఏ ప్రభుత్వం, మంత్రి లోకేశ్‌దేన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లయ్య, సెక్రటరి సురేష్, పాఠశాల హెచ్ఎం అవినాశ్, పీఈటీ చిరంజీవి, ఉపాధ్యాయ సంఘ నాయకులు యు.చంద్రజిత్‌యాదవ్, గంగినేని రాఘవ, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి, షకీలా బేగం, జనసేన పార్టీ నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వాన్ని నడిపించగల శక్తి వేదానికే ఉంది

- కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతీ మహాస్వామి

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశ్వాన్ని నడిపించగల శక్తి ఒక్క వేదానికే ఉందని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ మహా స్వామి ఉద్ఘాటించారు. బాపట్ల పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో వేంచేసియున్న శ్రీగంగాపర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ శతవార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విజయేంద్ర సరస్వతీ మహాస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడదారి పడుతున్న యువతను సన్మార్గంలో నడిపించడంతోపాటు విద్యా ప్రమాణాలు పెంపొందించాలన్నారు. దేశంలో సాంస్కృతిక, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ, కొరవడుతున్న నైతిక, మానవీయత విలువల్ని రక్షించే రీతిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పురాతన సాహిత్యాన్ని కాపాడటం, సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించటం సనాతన ధర్మానికి కంకణబద్ధులై పనిచేయడం ప్రధాన కర్తవ్యంగా.. మానవజన్మ సార్ధకత కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు విజయేంద్ర సరస్వతీ మహా స్వామికి బాపట్లలో ఘన స్వాగతం లభించింది. బాపట్ల పాత బస్టాండ్ వద్ద నుంచి కొత్త బస్టాండ్ వరకు శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం స్వామిజీ మహాయజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కంచి స్వామి భావదేవుని ఆలయంలో ఒక రాత్రి బస చేశారన్నారు. తనకు ఆ అనుభూతి లభించిందన్నారు. కార్తీక మాసంలో దీపోత్సవం చేయటం వల్ల ప్రజలకు సుఖశాంతులు కలుగుతాయన్నారు. దేవాలయాలలో సామూహికంగా దీపోత్సవం చేయడం మంచిదన్నారు. కంచి మఠం తరుపున గుంటూరులో శంకరకంటి ఆసుపత్రి నందు రూ.70కోట్లతో నూతన భవనం నిర్మించటం జరిగిందని, ఈ నెల 9న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని వెల్లడించారు. అనంతరం శ్రీ శంకర విద్యాలయం వేద పాఠశాలను సందర్శించారు. పాఠశాల సభ్యులకు, విద్యార్థులకు, గురువులకు అనుగ్రహభాషణం అందించారు. శంకర విద్యాలయ సభ్యులు బి.బాబునాగేంద్ర, శిఖరం భుజిగేంద్రమౌళి, చలపతిరావు, శ్రీరామశర్మ, శ్రీకాంత్, ప్రతాప్, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.



రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద కలశ పూజ చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి



కార్యక్రమానికి హాజరైన భక్తులు

మరమ్మతులు పూర్తి.. రెండో యూనిట్ వాడుకలోకి

రెంటచింతల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండో యూనిట్‌కు మరమ్మతులు పూర్తి చేశామని శుక్రవారం నుంచి వాడుకలోకి వచ్చిందని ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. రెంటచింతలలోని రెండు విద్యుత్ ఫీడర్లకు అనుసంధానం చేశామన్నారు. గురువారం రాత్రి 12 గంటల వరకు ఒక యూనిట్ ద్వారా 0.5633 ఎంయూల విద్యుత్ తయారైందని చెప్పారు. 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను 2 మీటర్లు, ఒక గేటును మీటర మేర ఎత్తి 34,046 క్యూసెక్కులు, టీఆర్‌సీ ద్వారా 8,475, పులిచింతలకు 42,521 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్ నుంచి 50507 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద దిగువకు 53400 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 60,917 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 53,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2823 , పశ్చిమ డెల్టాకు 4513, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల



సాగర్ రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు సాగర్ ప్రాజెక్ట్‌కు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్ట్ అధికారులు రెండు క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5367, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,307 , రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 16,200, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 67,674 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 67,674 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో 45.10 టీఎంసీలు..

అచ్చంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 45.10 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. ఎగువ నుంచి 49,887 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, గేట్ల ద్వారా 41,786 క్యూసెక్కుల నీరు, మొత్తం 58,786 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

బగళాముఖి సన్నిధిలో సింగర్ మనో దంపతులు



మనో దంపతులకు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

పిట్టలవానిపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ గాయకుడు సింగర్ మనో దంపతులు బగళాముఖి అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన పెద్దకుమారుడు షాకీర్‌బాబు హీరోగా, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన వటాక్కాళ్ తమిళ సినిమా ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్ర ఘన విజయం సాధించాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ. జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. సింగర్ మనో అమ్మవారికి అనేక స్తోత్రాలు పాడారని.. అందులో శ్రీబగళాముఖి భజే అనే స్తోత్రం బహుళ ప్రాచుర్యం పొందిందన్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కలకోట చక్రధర్‌రెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

టెట్‌పై సుప్రీంలో రివ్యూ పిటిషన్: మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు

గుంటూరు(విద్య), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)పై సుప్రీం కోర్టులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసినట్లు మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు తెలిపారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో అశోక్‌బాబును ఎన్‌టీఏ నాయకులు కలిశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తుందని, ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్.భాస్కరరావు, కోశాధికారి కె.నాగేషు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కూరపాటి రాజా తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల- వాడరేవు హైవేతో కొత్త సమస్యలు



చిలకలూరిపేట-చీరాల మధ్య పూర్తయిన హైవే

చిలకలూరిపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల - వాడరేవు 167ఏ హైవే చిలకలూరిపేట, వాడరేవు మధ్య దాదాపుగా పూర్తి కావచ్చింది. ఈ రహదారి కారణంగా ప్రజలు కొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారు. రహదారి నిర్మాణం అనంతరం పలు లోపాలు బయట పడుతున్నాయి. ఇటీవల తుఫాన్ కారణంగా.. కురిసిన భా రీ వర్షాలకు చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలోని కొన్ని ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. పసుమర్రులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, పక్కనే ఉన్న ఎస్టీ కాలనీలు పూర్తిగా మునిగిపోయాయి. దీంతో చిలకలూరిపేట చీరాల పాత హైవేకు గండి కొట్టి.. వరద నీటిని స్థానికులు బయటకు పంపారు. ఈ ప్రాంతానికి వచ్చిన చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హైవే అథారిటీ అధికారులకు ఫోన్లో.. మాట్లాడారు. దీంతో వెంటనే వారు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. అక్కడ కొన్ని లోపాలు ఉన్నాయని వారు అంగీకరించి త్వరలోనే పరిస్థితులు చక్క దిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ మార్గంలో పసుమర్రు వద్ద రోడ్డు దాటి వింజనంపాడు, అనంతవరం వెళ్లే జంక్షన్లలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం వింజనంపాడు క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు. వింజనంపాడు, అనంతవరం క్రాస్ రోడ్ల వద్ద అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆకట్టుకున్న వేషధారణ

నే నాట్యమాడితే..

నే ముత్యాల ముగ్గేస్తే..

నే రంగులు అద్దితే..

నాట్య మయూరిలా..

కళల విందుగా.. బాలల పండుగ!

- ఘనంగా ప్రారంభమైన వీవీఐటీయూ బాలోత్సవ్-2025
- అతిథుల చేతుల మీదగా పోటీలు ఆరంభం
- అబ్బురపరిచిన విద్యార్థుల ప్రదర్శనలు
- చిన్నారుల నైపుణ్యం వెలుగులోకి: ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్
- ఉన్నత శిఖరాలకు దోహదం: ఆచార్య మధుమూర్తి
- ఆనందోత్సాహాల నడుమ వీవీఐటీ వర్సిటీ ప్రాంగణం

పెదకాకాని, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీయూ బాలోత్సవ్-2025 వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఘనంగా శుక్రవారం ప్రారంభించారు. పదిహేను వేలకు పైగా పోటీదారులతో 20 అంశాలు 61 విభాగాల్లో మూడు రోజుల పాటు 32 వేదికలపై వేడుకగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి, ఏపీఎన్‌ఆర్‌టీ అధ్యక్షుడు డాక్టర్ కె. రవికుమార్ వేమూరి, ఈనాడు సంపాదకుడు ఎం.నాగేశ్వరరావు, వీవీఐటీ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ విశిష్ట అతిథులుగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. వాసిరెడ్డి విద్యాసాగర్, మండలి బుద్ధ ప్రసాద్, అతిథులు గంట మోగించి పోటీలను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవ్ ద్వారా చిన్నారులలో సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్ కృషిని కొనియాడారు. జాతి గొప్పతనాన్ని, భాష ప్రాభవాన్ని, సాంస్కృతిక విశిష్టతను భావితరాల ద్వారా చిరకాలం నిలిచిపోవాలన్న సంకల్పంతో ఈ బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కళల పట్ల అభిరుచి, ఆసక్తి గల చిన్నారులను ప్రోత్సహిస్తే జాతి సంస్కృతికి ఎటువంటి ఢోకా ఉండదన్నారు. దేశం గర్వించదగ్గ అద్భుతమైన కళాకారులుగా బాలోత్సవ్‌లో పాల్గొనే చిన్నారులు రూపాంతరం చెందుతారన్న అభిప్రాయం వ్యక్తపరిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. మధుమూర్తి మాట్లాడుతూ చదువుతోపాటు ఉన్నత శిఖరాలు చేర్చడానికి కళలు దోహదపడతాయన్నారు. బాలోత్సవ్ వంటి కార్యక్రమాల ద్వారా చిన్నారులలో స్నేహ భావం పెంపొందుతుందన్నారు. డాక్టర్ కె.రవికుమార్ వేమూరి మాట్లాడుతూ చిన్న వయస్సులో కళల పట్ల ఆసక్తి కలిగి ఉండటం మంచిదని, ఈతరం చిన్నారులు అన్ని రంగాలలో వారి ప్రతిభను ప్రదర్శించడం మంచి పరిణామమని అన్నారు. వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చిన్నారులు ఆనందంగా ఉంటే అందరూ సంతోషంగా ఉంటారన్నారు. మూడు రోజులు ఉత్సాహంగా పోటీల్లో విద్యార్థులు పాల్గొని మధురానుభూతులు పొందాలని అన్నారు. ఈనాడు సంపాదకుడు ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలోత్సవం అంటే చిన్నారులకు వేడుకని, గెలుపు ఓటములకన్న ఈ వేడుకలో పాల్గొనడం ముఖ్యమన్నారు. ఈ అనుభూతులు చిన్నారులకు జీవితమంతా గుర్తుంటాయని పేర్కొన్నారు. పిల్లలు దేశ సంపద అని మంచి పిల్లలతో మంచి దేశం తయారవుతుందన్నారు.



గంట కొట్టి పోటీలను ప్రారంభిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు



ప్రదర్శనలను వీక్షిస్తున్న కళాశాల విద్యార్థులు

పోటాపోటీగా విద్యార్థులు ప్రదర్శనలు

బాలోత్సవంలో విద్యార్థులు పోటాపోటీగా ప్రదర్శనలు చేస్తున్నారు. సందర్శకులను అబ్బురు పరిచే విధంగా ప్రతిభను చాటుతున్నారు. యూనివర్సిటీ ప్రాంగణమంతా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సందర్శకులతో కళకళలాడుతోంది.



శ్రద్ధగా చిత్రాలను తీర్చిదిద్దుతున్న విద్యార్థులు



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య రూపకం


సంతనూతలపాడులో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు


పోలీస్‌పెరడ్ మైదానంలో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు, సిబ్బంది

స్వాతంత్ర్య సమర నినాదం 'వందేమాతరం'

- ఎస్పీ హర్షవర్ధనరాజు
- ఘనంగా వందేమాతర గీతం 150 వసంతాల వేడుకలు

ఒంగోలు క్రైం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భరత జాతిని ఒక్కటి చేసిన సమర నినాదం వందేమాతర గీతం అని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో వందేమాతర గీతం 150 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ వందేమాతర గీతం ఆలపించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వందేమాతరం అంటే తల్లీ నీకు నమస్కారం అని అర్థమన్నారు. మన మాతృభూమికి అంకితమైన ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, సీఐలు వై.నాగరాజు, ఎం.శ్రీనివాసరావు , టి.విజయకృష్ణ, ఎన్.శ్రీకాంత్‌బాబు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు స్ఫూర్తి..

ఒంగోలు(రూరల్): వందేమాతరం గీతం దేశసమైక్యతకు నాంది అని, ప్రతి ఒక్కరూ ఆలపించాలని ఎంపీడీవో కె.రాజశేఖరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఆ గేయాన్ని రచించిన బంకించంద్రచటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడు తూ స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతర గీతం దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చింద న్నారు. ఈ కార్యక్రమంలో శేషుబాబు, ఏఈ రామ్‌ప్రసాద్, ఏపీఎం నాగేశ్వరరావు ఏపీవో విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.


ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో నివాళ్లు అర్పిస్తున్న ఉద్యోగులు

విద్యాసంస్థల్లో..

ఒంగోలు విద్య నగరంలోని అన్ని విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ గీతం వందేమాతరం 150వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపకులు, సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, డైరెక్టర్ జి.హర్షిత, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధీర్‌చక్రవర్తి, విభాగాధిపతి పి.శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామపిచ్చయ్య, ఏవో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రకేసరి యూనివర్శిటీలో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ డీవీఆర్.మూర్తి, ప్రిన్సిపాల్ నిర్మలామణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో ఉత్తేజాన్ని నింపిన వందేమాతరం గేయాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తియిన సందర్భంగా శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మండల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం వందేమాతరం గేయం ఆలపించారు. కార్యక్రమంలో ఎంపిడీవో బి.రామాంజనేయులు మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ రణ నినాదంలా నిలిచింది వందేమాతరం. శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ గారు రాసిన ఈ గేయం యావత్ దేశాన్ని ఉద్యమ స్ఫూర్తితో నడిపించింది. స్వతంత్ర సమరయోధులకు మనో బలాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేఖ, ఎంఈవో 2 రామారావు, సాయిబాబా స్కూల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డవరప్పాడులో..

మద్దిపాడు: వందేమాతరం గీతం 150 సంవత్సరాల సంబరాన్ని దొడ్డవరప్పాడులోని బీపీ అండ్‌కేఆర్ విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు జాతీయ రహదారి వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కాలేజీ హెచ్‌వోడీ కవిత, ప్రొఫెసర్ జీవీ.సుబ్బమ్మ, షమ్మీర్, సంతోష్‌కుమార్, రమా, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

దళిత ఉద్యోగులను దూషించిన అధికారిపై చర్యలు తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో దళిత వర్గానికి చెందిన ఇద్దరు ఆఫీసు సబార్డినేటర్లను కులం పేరుతో దూషించడమే కాకుండా చేయి చేసుకున్న ఉన్నతాధికారి రవీంద్రనాథ్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఒంగోలులోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం వద్ద ఏపీ వాణిజ్య పన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ వాణిజ్యపన్నులశాఖ ఆఫీసు సబార్డినేట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామన సమయంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందేమాతరం స్ఫూర్తితో హక్కుల కోసం నినదిస్తూనే ఉంటామన్నారు. దళిత ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 14వతేదీన కార్యచరణ చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ల నాయకులు జాజుల నరసింగరావు, జె.సుజాతబాయి, తోట కిరణ్‌కుమార్, కరిచేటి సుధాకర్, ప్రసన్నకుమార్‌రెడ్డి, రవికుమార్, యూవీ.సుబ్బారావు, వై.కొండలరావు, ఎస్‌కే.ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం


వెంకటకృష్ణారావు, చంద్రబాబులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నాగులుప్పలపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని ఆచార్య రంగా కిసాన్‌సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు అనేక సేవలు అందిస్తున్న కనపర్తి ఎత్తిపోతల పథకం, ఉప్పుగుండూరు సొసైటీలు ఉత్తమ పథకాలుగా ఎంపికయ్యాయి. దాంతో మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, 20 సూత్రాల పథకం అమలు ఛైర్మన్ లంకా దినకర్ చేతుల మీదుగా కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు, ఉప్పుగుండూరు సొసైటీ ఛైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబుకు అవార్డులను అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నడిపినేని శేషగిరి, గొల్లకారం వెంకట్రావు, పెంట్యాల శ్రీనివాసరావు, మసిముక్కు భాస్కరరావు, సొసైటీ సీఈవో నన్నపనేని కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ

పొన్నలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వైద్యశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్య అధికారి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య అధికారి కృష్ణ చైతన్య మాట్లాడుతూ శరీరంలో ఎక్కడైనా కణజాలం అవసరం లేకుండా విపరీతంగా పెరిగిపోవడమే క్యాన్సర్ అని పేర్కొన్నారు. ఆహార అలవాట్లు, రేడియేషన్లు, ధూమపానం, ఊబకాయం, తదితరాలు క్యాన్సర్‌కు కారకాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా నాగులుప్పలపాడులో ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఓనారియల్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి నివారణ మార్గాలను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోండి

- సమస్యల పరిష్కారం దిశగా కమిటీ అడుగులు
- అమరావతిలో ప్రత్యేక సమావేశం
- తమ డిమాండ్లను కమిటీ ముందుంచిన ఓనర్ల అసోసియేషన్

చీమకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కార మార్గాలను సూచించేందుకు ప్రభుత్వం నియమించిన కమిటీ తన పనిని మొదలుపెట్టింది. శుక్రవారం అమరావతి సచివాలయంలో కమిటీ తన తొలి సమావేశాన్ని నిర్వహించింది. కమిటీ ఛైర్మన్, మైన్స్ జేడీ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు. ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో చీమకుర్తి, బూదవాడ, మార్టూరు, చిలకలూరిపేట, పల్నాడు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ ప్రధాన నాయకులు పాల్గొన్నారు. వీరు తమ డిమాండ్లను, గ్రానైట్ పరిశ్రమ మనుగడకు తీసుకోవాల్సిన నిర్ణయాలను కమిటీ ముందు ఉంచారు. ట్రాన్సిట్ ఫారంను రద్దు చేయాలని, శ్లాబ్ సిస్టంలో భాగంగా కొనుగోలు చేసిన క్యూబిక్ మీటర్ ముడిరాయిపై ఇస్తున్న అనుమతిని 350 అడుగుల నుంచి 450కి పెంచాలని కోరారు. మైనింగ్ రాయల్టీని ప్రభుత్వం నిర్దేశించిన మేరకే చెల్లిస్తామని, అదనంగా చెల్లించలేమని తెలిపారు. ఈసీ క్వాంటిటీని పరిశీలించాలని కోరారు. ఈ డిమాండ్లపై కమిటీ సభ్యులు స్పందిస్తూ తామే స్వయంగా గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలించి తగు నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. సమావేశంలో చీమకుర్తి ప్రాంతం నుంచి అసోసియేషన్ నాయకులు యర్రగుంట్ల శ్రీనివాసరావు, కాట్రగడ్డ రమణయ్య, లగడపాటి శ్రీనివాసరావు, ఇంటూరి భవానీ ప్రసాద్‌లు పాల్గొన్నారు. కమిటీ తన విచారణను ఈనెల 15వ తేదీలోపు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. ఈ నివేదిక పరిశీలించిన తర్వాత ప్రభుత్వం గ్రానైట్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించనుంది.


సమావేశంలో పాల్గొన్న గనులశాఖ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు

18న సామాజిక న్యాయంపై ధర్నాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదలోనే కాకుండా చట్టసభల్లో, అన్ని రంగాల్లో అందరికీ వాటా కావాలంటూ ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ధర్నాలు, సదస్సులను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శుక్రవారం జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి కేవీ.కృష్ణగౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో జనగణనతో పాటు కులగణన కూడా జరగాలన్నారు. కులాల్లోని జనాభా ప్రాతిపదికన ఆయా వర్గాలకు చట్టసభల్లో, సంపదలో, అన్ని రంగాల్లో వారి వాటా వారికి దక్కాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం దేశ సంపదను, పరిశ్రమలను. సహజసంపదను కొద్ది మంది కార్పొరేటర్ల చేతుల్లో పెడుతున్నారని ఆరోపించారు. దీంతో పేదలు మరింత పేదలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, సయ్యద్‌యాసిన్, నల్లూరి మురళి, శ్రీరామ్ శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్. రామకృష్ణ, వి.హనుమారెడ్డి, ఎస్‌డీ.మౌలాలి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

పంట పొలాలకు వెళ్లే దారేది

బల్లికురవ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన మొంథా తుపాన్‌తో పంట పొలాలకు వెళ్లే రోడ్లు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. దీంతో రైతులు పంటలు సాగు చేసే వీలు లేక రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని వల్లాపల్లి గ్రామంలో పరమర వైపు ఉన్న పంట పొలాలకు వెళ్లే రోడ్డు భారీ వర్షాలకు దెబ్బతింది. రోడ్డు మొత్తం కోతకు గురైంది. బురదమయంగా మారడంతోపాటు కల్వర్టు వద్ద రెండు వైపులా రోడ్డు కోతకు గురికావడంతో రైతులు పంటల సాగుకు వెళ్లే దారి లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రెండు వందల ఎకరాల పంట భూములకు వెళ్లే దారి కావడంతో రైతులు ఈ రోడ్డున వాహనాలు వెళ్లే వీలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు వెంటనే అభివృద్ధి చేయకుంటే ఈ ఏడాది పంటలు సాగు చేయడం కష్టం అని రైతులు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ నిధులతో అయిన రోడ్డును వెంటనే అభివృద్ధి పరచాలని రైతులు కోరుతున్నారు.


వర్షాలతో కోత పడిన రోడ్డు


వల్లాపల్లిలో దెబ్బతిన్న పొలాలకు వెళ్లే రహదారి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

టంగుటూరు(కొండపి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అన్నపరెడ్డి చందన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. డిస్కస్‌త్రో ఈవెంట్ మొదటి స్థానాన్ని సాధించిందని పీడీ అరుణ తెలిపారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

జెండా ఆవిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక 60అడుగుల రోడ్డులో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు జి.రమేష్ మాట్లాడుతూ 1917లో రష్యాలో విప్లవం వచ్చిందన్నారు. ఆ స్ఫూర్తితో ప్రపంచంలోని అనేక దేశాల్లో కమ్యూనిస్టులు పార్టీలు ఏర్పాటు చేసుకొని పోరాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్.వీరస్వామి, వి.మాలకొండయ్య, భీష్మాచారి, జి.ఆదిలక్ష్మి, టి.భక్తసింగ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ సాయం.. గందరగోళం

(5వ పేజీ తరువాయి)

సివిల్ సప్లయిస్, రెవెన్యూ విభాగానిది. కానీ క్షేత్రస్థాయిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరించడంతో తుఫాన్ బాధితులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోజువారీ పంపిణీ ఎన్ని కుటుంబాలకు జరిగింది, ఇంకా ఎన్ని కుటుంబాలకు సాయం అందించాల్సి ఉందనే ప్రాథమిక సమాచారం కూడా డీఎస్‌వో వద్ద ఉండకపోవడం సమన్వయలోపాన్ని సూచిస్తోంది.

సా..గుతున్న ప్రక్రియ

తుఫాన్ ప్రభావిత కుటుంబాలను 33,750గా యంత్రాంగం లెక్క తేల్చింది. 356 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన వారి సంఖ్య 12,200 కుటుంబాలు ఉన్నాయి. వీరితో పాటు జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులు 13,000, చేనేత కుటుంబాలు 8,550 మందిని నిత్యావసరాల సాయానికి అర్హులుగా యంత్రాంగం గుర్తించింది. వీరిలో పునరావాస శిబిరాల్లో ఆశ్రయం పొందిన కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలు, మత్స్య, చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కేజీల బియ్యంతో పాటు పామాయిల్ ప్యాకెట్, ఉల్లిపాయలు కేజీ, కందిపప్పు కేజీ, పంచదార కేజీ, బంగాళాదుంపలతో కిట్ రూపంలో అన్నీ ఒకేసారి అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. పంపిణీ ప్రక్రియ మూడు రోజుల్లోనే పూర్తి కావాలని ప్రభుత్వం సూచించింది. కానీ శుక్రవారం వరకు ఎంత పంపిణీ జరిగిందనేది పౌర సరఫరాల విభాగం వద్ద స్పష్టత లేదు. బాధితులు సమీపంలోని రేషన్ షాపుల్లో నిత్యావసరాలు అందుకునేలా మ్యాపింగ్ చేసింది. 25 మండలాల పరిధిలో 686 షాపులను ఇందుకు ఎంపిక చేసింది. మ్యానువల్‌గా కూడా డీఎస్‌వో అభ్యర్థన మేరకు మరికొన్ని దుకాణాల్లో బాధితులకు నిత్యావసరాలు అందేలా ఏర్పాట్లు చేసింది. ఈ మొత్తం ప్రక్రియ అంతా గజిబిజిగా మారింది. నిత్యావసరాలు అందుకోవడానికి బాధితులకు పోర్టబులిటీ అవకాశం కల్పించినా అది అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు. బియ్యం, పంచదార తొలుత రేషన్ డీలర్ల వద్దకు చేరాయి. తర్వాత రోజు దుంపలు, ఉల్లిపాయలు, ఇంకో రోజు కందిపప్పు, పామాయిల్ ఇలా వ్యవధి ఇస్తూ డీలర్ షాపుల వద్దకు నిత్యావసరాలు చేరాయి. నిత్యావసరాల కోసం మూడు సార్లు రేషన్ దుకాణం చుట్టూ తిరిగి థంబ్ వేసి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు బాధితుల మ్యాపింగ్ డీలర్ పరిధిలో కానీ వారు ఎక్కువగా ఉండడంతో వారికి సమాచారం చేరడం కూడా కష్టమైపోయింది. ఇదిలా ఉంటే ఇదే అదనుగా రెండు సరుకులు మాత్రమే ఇచ్చి ఆరింటికి థంబ్ వేయించుకుని పక్కదారి పట్టించిన డీలర్లూ ఉన్నారు. కార్డులు లేని కుటుంబాలకు భటిప్రోలు మండల పరిధిలో ఇచ్చిన సరుకులను కూడా డీలర్లు వెనక్కి తీసుకున్నారని సమాచారం.

ఎన్జీ రంగా.. అందరికీ ఆదర్శం

(5వ పేజీ తరువాయి)

పెట్టినట్లు గుర్తుచేశారు. 33 ఏళ్ల వయసులోనే ఆయన రైతుల ఉద్యమాన్ని ముందుండి నడిపించారన్నారు. 1964లో 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రసంగించి రైతు భూమిని కట్టడి చేసే చట్టాన్ని ఆయన అడ్డుకున్నారన్నారు. 50 ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా చేసిన సేవలకు గిన్నీస్ వరల్డ్ రికార్డులకు ఎక్కడం అరుదైన గౌరవమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని, రైతుకు ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గి ఉత్పత్తి పెరగాలన్నారు.

సమర్థ నిర్వహణతోనే నీటి భద్రత

సమర్థ నీటి నిర్వహణ, ముందస్తు చర్యల వల్ల రిజర్వాయర్లు 95 శాతం నిండాయన్నారు. గత ప్రభుత్వంలో రిజర్వాయర్ల గేట్లను కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. డ్రిప్ ఇరిగేషన్‌లో ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, మిగిలిన వారికి 50 నుంచి 90 శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కౌలు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పిడి చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు, పంటలకు సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. అనంతరం ఆధునిక రాజ్యాంగ వ్యవస్థలు అనే పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ వీపీ సత్యనారాయణ, శాస్త్రవేత్త కుర్రా శ్రీనివాసబాబు, ఎన్జీ రంగా ట్రస్ట్ సభ్యులు రామినేని కిశోర్‌బాబు, టి.యుగంధర్, బి. నాగేశ్వర్‌మిత్రా, ఆదర్శ రైతు కుంచాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ 'పెండింగ్'?

(5వ పేజీ తరువాయి)

పనులు జరుగుతుంటాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను ఫీల్డు అసిస్టెంట్లుగా నియమించుకోవడం అనవాయితీ. రాజకీయ అండదండలు, అధికారుల సహకారంతో ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నా చర్యలు శూన్యంగా ఉంటున్నాయి. ఈకేవైసీ, ఎన్ఎంఎంఎస్‌ను అమల్లోకి తీసుకురావడంతో బోగస్ జాబ్ కార్డులకు కూడా చెక్ పెట్టినట్లయింది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రైవేట్ ఉద్యోగుల పేర్లపై జాబ్ కార్డులు సృష్టించి వేతనం కొట్టేస్తున్న ఉదంతాలు కోకొల్లలు. పనికి రాకుండానే రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ఉపాధి కార్మికుని పేరుతో వేతనాలు చెల్లించడం పెద్దఎత్తున జరుగుతోంది. ఏటా రూ కోట్లలో ఉపాధి నిధులను కొందరు అధికా రులు.. ఫీల్డ్ అసిస్టెంట్లు పంచుకుతింటున్న ఉదంతాలు సామాజిక తనిఖీలో వెలుగు చూసినా.. వారిపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. కొట్టేసిన సొమ్మును రికవరీలు కూడా ఉండటం లేదు. నూతన హాజరు విధానంతో కొంత మేర అక్రమాలను అరికట్టే అవకాశం ఉంది.


వృత్తివిద్యాశిక్షణలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో పురుషోత్తం

బల్లికురవ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో జరిగిన ఒకేషనల్ శిక్షణ వస్తువులు ప్రదర్శనలో బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. శుక్రవారం బాపట్ల జిల్లా కేంద్రంలో 40 పాఠశాలల స్థాయిలో జరిగిన పోటీల్లో బల్లికురవ కేజీబీవీ విద్యార్థులు తాము ఎంతో పట్టుదలతో విద్యాలయంలో నేర్చుకున్న కలంకారి డిజైన్లు, కుట్టు మిషన్లకు సంబంధించిన పలు రకాల వస్తువల తయారీపై నలుగురు విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. వీటిని జిల్లా విద్యాశాఖ డీఈవో పురుషోత్తం, డిప్యూటీ ఈవో గంగాధర్, జీసీడీవో చారులత, వైద్యఆరోగ్యశాఖ అధికారి విజయమ్మలు విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన శిక్షకురాలు కొటారి శీరిషను ప్రత్యేకంగా అభినందించి వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాలయ ప్రిన్సిపాల్ సరళకుమారి, ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పొదుపు సంఘాల బలోపేతానికి రికార్డులు తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న వెలుగు అధికారులు

బల్లికురవ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పొదుపు సంఘాల బలోపేతానికి రికార్డులు తనిఖీలు చేస్తున్నామని వెలుగు ఏపీఎం తుమాటి రాజారావు అన్నారు. మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో 12 వీవోఏలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. తీర్మాన పుస్తకాలు, నగదు లావాదేవీలు, స్త్రీనిధి వంటి రికార్డులను పరిశీలించారు. గ్రామాలలో నిరుపేదలకు వెలుగు ద్వారా రుణాలను సకాలంలో అందేలా చర్యలు చేపడతామన్నారు. వెలుగు వీవోఏలు కూడా అన్ని రికార్డులు సక్రమంగా నమోదు చేయాలన్నారు. ప్రతి రుపాయికి ఖర్చులు వ్యయంపై నమోదు చేసి ఉండాలని వారు తెలిపారు. ఈ తనిఖీలో స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, సీసీలు ప్రమీలా, పేరయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రేపు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

అద్దంకి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అద్దంకి మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మానం మురళీమోహన్‌దాస్, అరిగల నాగరాజులు కోరారు. మెగా ఉచిత వైద్యశిబిరం జరిగే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాట్లను శుక్రవారం టీడీపీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు శంకరకంటి వైద్యశాలలో ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలకు వచ్చే సమయంలో ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్‌లను తీసుకురావాలని కోరారు. పూర్తి వివరాలకు 7013723538, 7013898890 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కాకాని అశోక్, కుందారపు రామారావు, లహరి, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, రామాంజనేయులు, గుంజి శ్రీనివాసరావు, రామాంజనేయులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటివైద్యశిబిరం

మార్టూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజానీకం సద్వినియోగపరచుకోవాలని ఆయన కార్యాలయ ప్రతినిధులు కోరారు. ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్, గ్రీన్ స్పార్క్‌ఫౌండేషన్ సంయుక్తంగా, శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంతేగాకుండా శిబిరానికి వచ్చినవారికి కంటి పరీక్షలతోపాటు, బీపీ, షుగర్, రక్తపరీక్షలను నిర్వహిస్తారన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కోసం పంపిస్తామన్నారు.

చీరాల, పొన్నూరులో మొబైల్ పాస్‌పోర్ట్ సేవాకేంద్రాలు

- చీరాల్లో ఈనెల 10, పొన్నూరులో 11వ తేదీన అవకాశం

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు ఈనెల 10న చీరాల మహిళ మండలి వద్ద, 11వ తేదీన పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ పోర్ట్ మంత్రిత్వశాఖ, విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నసేవలను పొందేందుకు వివరాలకు 86625 70050ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

కేజీఎం విద్యార్థినులకు బంగారు పతకం


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఏలూరులో నిర్వహించిన 69వ అండర్-17 తైక్వాండో పోటీల్లో స్థానిక కేజీఎం బాలికోన్నత పాఠశాలకు చెందిన షేక్ తాహిరా ఉత్తమ ప్రదర్శన కనబరచి రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం దక్కించుకొని బంగారు పతకం సాధించింది. అలాగే తస్లీమా సిల్వర్ మెడల్ సాధించింది. దీంతో శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

తీరంలో ఎంపీ, కలెక్టర్ విస్తృత పర్యటన

- తుఫాన్ ప్రభావంతో కూలిన వంతెనలు పరిశీలన
- వెంటనే నిర్మాణాలకు ఆదేశాలు


కూలిన కల్వర్టులను పరిశీలిస్తున్న ఎంపీ, కలెక్టర్

వాడరేవు(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు, రామాపురం తీర ప్రాంతాల్లో శుక్రవారం ఎంపీ కృష్ణ ప్రసాద్, కలెక్టర్ డావినోద్‌కుమార్‌తో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా తుఫాన్ ప్రభావంతో కూలిన కల్వర్టులు, చప్టాలు పరిశీలించారు. రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోవడంపై ఆరా తీశారు. కూలిన చోటల్లా వంతెనల ఏర్పాటుకు వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. మొత్తం మూడు వంతెనలు, ఒక చప్టాకు సంబంధించి సుమారు రూ. రూ.6 కోట్లతో హై లెవల్ వంతెనల నిర్మాణంపై చర్చలు జరిపారు. వారివెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

మురుగు కాలువలలో పూడికతీత పనులు


ముప్పవరంలో మురుగు కాలువలలో పూడిక తొలగిస్తున్న కార్మికులు

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణంగివరం, ముప్పవరం గ్రామాలలో మురుగు కాలువలలో పేరుకున్న పూడిక తొలగింపు చర్యలు శుక్రవారం ప్రారంభించారు. మురుగు కాలువలలో పేరేకున్న మురుగుతో దుర్గంధంతో పాటు అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాలలో మురుగు కాలువలలో చేరిన పూడికతో వర్షపు నీరు ముందుకుపోని పరిస్థితిని గుర్తించిన అధికారులు పూడిక తొలగింపునకు శ్రీకారం చుట్టారు. పనులను పంచాయితీ కార్యదర్శులు ఎల్.సునీత, జానీబేగం పర్యవేక్షించారు.

స్వాతంత్ర్యోద్యమానికి వందేమాతర గీతం స్ఫూర్తి

- విద్యార్థులతో కలసి గీతం ఆలపించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు
- చినగంజాంలో ర్యాలీ నిర్వహించిన పాఠశాల విద్యార్థులు


వందేమాతర గీతాన్ని ఆలపిస్తున్న మంత్రి పార్థసారథి, ఎంపీ కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమర యోధులకు వందేమాతర గీతం స్ఫూర్తి నింపిందని మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, కలెక్టర్ వినోద్ కుమార్‌లు పేర్కొన్నారు. శుక్రవారం చీరాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వందేమాతర గీతం ఒకటిన్నర శతాబ్దం పూర్తి చేసుకున్న నేపథ్యంలో గీతాన్ని విద్యార్థులతో కలిసి ఆలపించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గీతం ఆలపించి 150 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన వేడుకలు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అన్ని పాఠశాలల్లో ప్రతిరోజు గీతాన్ని ఆలపించేలా చూడాలన్నారు. విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందించే దిశగా కృషి చేయాలన్నారు. గీత రచయత బంకించంద్ర ఛటర్జీ, రైతు ఉద్యమ నేత ఆచార్య ఎన్జీ రంగల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : 150 వసంతాలు పూర్తి చేసుకున్న వందేమాతర గీతం దేశ ఔన్నత్యాన్ని, విశిష్టతను చాటిందని కొండమంజులూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఐ.అనిత అన్నారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం 150 వసంతాలు పూర్తయిన వందేమాతర గీతం, 75వసంతాల స్కౌట్స్ అండ్ గైడ్స్ వేడుక ఘనంగా నిర్వహించారు. వందేమా తరం గీతంపై విద్యార్థులకు వ్యాసరచన, స్వాతంత్ర్యో ద్యమం, పాల్గొన్న యోధుల చిత్రాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వీటి ప్రాధాన్య తను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలం లోని నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశా లలో నిర్వహిచిన వేడుకలో హెచ్ఎం జంపని వెంకటేశ్వర్లు (జేవీఆర్), ఉపాధ్యాయులు వీరాంజనే యులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

పంగులూరు: మన దేశ జాతీయగీతమైన వందేమాతర గీతం 150 ఏళ్ల వసంతాల వేడుక పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతరం గీత రచయిత బంకించంద్రచటర్జీ చిత్ర పటంవద్ద ఎంపీడీవో కె.స్వరూపారాణి నివాళి అర్పించారు. కార్యాలయ సిబ్బంది భక్తి భావంతో వందేమాతర గీతం ఆలపించారు. కార్య క్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్, వైద్యాధికారి డాక్టర్ శివ చెన్నయ్య, కార్యాలయ పరిపాలనాధికారి టి.రమేష్, రిబ్కా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో వందేమాతరం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బంకించంద్రచటర్జీ రచించిన జాతీయ గీతం వందేమాతరం 150 ఏళ్ల పూర్తి అయిన సందర్భం గా మండల పరిధిలో వేడుకలు నిర్వహించారు. చినగంజాం గ్రామంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుండి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయంలో వందేమాతరం గీత రచయిత బంకీం చంద్రచటర్జీ చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించి వందేమాతర గీతం ఆలపించారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, తహసీల్దార్ జె.ప్రభాకరరరావు, ఎంపీడీవో కె.ధనలక్ష్మి, మండల సర్వేయర్ లోకేష్, గ్రామ కార్యదర్శులు కె.అంజయ్య, పి.శ్రీనివాసరావు, ఎం.వెంకటరమణ, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



బంకించంద్రఛటర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పంగులూరు ఎంపీడీవో, చినగంజాంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ అపోహ మాత్రమే
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొమ్మమూరు కాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు అపోహ మాత్రమే అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ అంశంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. రైతాంగానికి నష్టం చేసే చర్యలను తమ ప్రభుత్వం చేపట్టదన్నారు. వైసీపీ రాజకీయ ఉచ్చులోనికి రైతులను లాగుతోందని, రైతులు ఆ ఉచ్చులో పడవద్దన్నారు. ఈ అంశానికి స్పందించిన పూర్వాపరాలను ఆయన వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల ప్రయోజనం పీ4 పథకాన్ని చిత్తశుద్ధితో అమలుచేస్తున్నారన్నారు. సీఎం పిలుపు మేరకు ఈ పథకంలో భాగమయ్యేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ ముందుకు వచ్చాడన్నారు. బాపట్ల జిల్లా అప్పాపురం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మించి ప్రాంత రైతులకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చాడన్నారు. అయితే డీపీఆర్ తప్పుల తడకగా ఉందన్నారు. దానిపై సాంకేతిక పరంగా లోపాలు ఉన్నాయని గుర్తించి, ప్రభుత్వం నాలుగు నెలల క్రితమే ఈ ప్రతిపాదనను తిరస్కరించిందన్నారు. ఈ పథకానికి సంబంధించి సాంకేతిక అంశాలపై తాను కూడా స్వయంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు ఎమ్మెల్యే సాంబశివరావు తెలిపారు. ఈపథకం ఏర్పాటుకు సంబంధించి ఏమైన అనుమానాలు ఉంటే సంబంధితశాఖ మంత్రి, అధికారులతో నివృత్తి చేయించే బాధ్యత తనదేనని, రైతులు ఎవ్వరూ అందోళన చెందాల్సిన పనిలేదని ఎమ్మెల్యే స్పష్టమైన భరోసా ఇచ్చారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ ఉచ్చులో పడవద్దన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కొమ్మమూరు కాలువలను నిర్లక్ష్యం చేసిందని, కనీసం మరమ్మతులు కూడా కల్పించకపోవడంతో కాలువ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలోనే చివరి భూములకు కూడా నీరు అందేలా కృషి చేస్తున్నామన్నారు. రైతులు ఏ ప్రాంతంలో ఉన్నా, వారి ప్రయోజనాలు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమన్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్ పనుల పరిశీలన

- పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొండయ్య సూచించారు. శుక్రవారం ఏరియా వైద్యశాల సమీపంలో జరుగుతున్న పనులను సూపరిండెంట్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. పనులకు సంబంధించి ఆరా తీశారు. అలాగే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. 80 మందికి రూ.48,12,835 విలువైన చెక్కులను అందజేశారు. ఆయన వెంట టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్ర నాథ్ చెప్పారు. మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, డాక్టర్ సుభాషిణీ తదితరులు ఉన్నారు.

కామేపల్లి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తేవాలి

తక్షణమే మరమ్మతులు చేయాలని వినతి


వినియోగంలో లేని ఎత్తిపోతల పథకం

సంతమాగులూరు నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లి గ్రామ రైతులకు సంబంధించిన ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి తక్షణమే వినియోగంలోకి తేవాలని ఆ గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకం కింద 561 ఎకరాలలో అరుతడి పంటలు సాగు చేశారు. రెండు దశాబ్దాల క్రితం పథకం నిర్మించిన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ ఎత్తిపోతల పథకం మూతపడింది. ప్రస్తుతం జోరుగా వర్షాలు కురవడం, వాగులు, వంకలు పొర్లి ప్రవహిస్తుండడంతో తిరిగి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోనికి తేవాలని రైతులు కోరుతున్నారు. నవంబరు నెల నుంచి వర్షాలు తగ్గుముఖం పడతాయని, మిర్చి, ప్రత్తి, లాంటి వాణిజ్య పంటలకు ఆరుతడి సాగు కింద నీరు పెట్టుకునేందుకు ఈ ఎత్తిపోతల పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఎత్తిపోతల పథకం వైపు అధికారులు దృష్టి సారించకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి చిన్నపాటి మరమ్మత్తులు పూర్తిచేసి తక్షణమే వినియోగంలోకి తేవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్‌డీఎస్ఎస్ ద్వారా గ్రామాలలో త్రీఫేస్ విద్యుత్


నూతన స్తంభం ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా ఆర్‌డీఎస్ఎస్ పథకం ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఏఈ ఆంజనేయులు తెలిపారు. ఈ పథకంలో భాగంగా మండలంలోని జార్లమూడివారి పాలెం, బైటమంజులూరు గ్రామాలలో విద్యుత్ లైన్లను ఎత్తైన నూతన విద్యుత్ స్తంభాలు, అధునాతన కేబుల్ ఏర్పాటుతో ఆదునీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలుతో గ్రామాలలో లో ఓల్టేజ్ సమస్య తీరడంతో పాటు త్రీఫేస్ విద్యుత్ నిరంతరం పొందే అవకాశం ఉంటుందన్నారు. జేవీ.పాలెంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు కార్యక్రమంలో శ్రీనివాసరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలో లారీల బ్యాటరీలు చోరీ

బల్లికురవ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నుపల్లి రోడ్డులో గ్రానైట్ ఫ్యాక్టరీలోని లారీల నుంచి ఆరు బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. నిలిపి ఉంచిన లారీల నుంచి బ్యాటరీలు చోరీ కావడంతో లారీల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ


పాఠశాలకు బీరువా బహూకరిస్తున్న మోపర్తి లక్ష్మినారాయణ

మేదరమెట్ల, ,నవంబరు 7,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావినూతల మండల పరిషత్ పాఠశాలకు పలువురు దాతలు ఇనుప బీరువా కుర్చీలను పంపిణీ చేశారు. శుక్రవారం రావినూతలలో మోపర్తి శేషయ్య, వెంకటరత్నంల జ్ఞాపకార్థం, రూ.16 వేల విలువైన బీరువాను మోపర్తి లక్ష్మినారాయణ, శ్రీనివాసరావులు ప్రధానోపాధ్యాయుడు చేబ్రోలు గోపీకి అందజేశారు. కారసాల చిన్న వీరయ్య, చేబ్రోలు అనంత వరప్రసాద్‌ల జ్ఞాపకార్థం కారసాల శ్రీనివాసన్ నాలుగు కుర్చీలను పాఠశాలకు బహూకరించారు. పాఠశాలకు దాతలు సౌకర్యాలు కల్పించడంపై ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధుడి నుంచి నగదు అపహరణ

బ్యాంకులో లోన్ కట్టేందుకు వెళ్లగా పథకం ప్రకారం చోరీ

ఇంకొల్లు, నవంబరు 7,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో ఓ వృద్ధుడి నుంచి ఇద్దరు దుండగులు రూ.3.90లక్షలు నగదును అపహరించుకొని వెళ్లిన ఘటన ఇంకొల్లులో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంకొల్లుకు చెందిన చిలంకూరి కాంతయ్య(75) ఉదయం 11 గంటల సమయంలో బ్యాంకు ఆఫ్ ఇండియాలో తను తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను విడిపించుకునేందుకు రూ.3.90లక్షలు తీసుకొని సైకిల్‌పై వచ్చాడు. అయితే బ్యాంకులో అప్పు రూ.4లక్షలు ఉందని అధికారులు తెలపడంతో మిగిలిన రూ.10వేలు తెచ్చుకునేందుకు ఇంటికి వెనుదిరిగారు. సైకిల్‌పై కాంతారావు బయలుదేరి ఇంటి సమీపంలోకి చేరుకోగా మోటర్‌సైకిల్‌పై ఇద్దరు దుండగులు వెంబడించి వెళ్లి రూ.100 నోట్లు రెండు కిందవేసి నీ డబ్బులు పడిపోయాయయని చెప్పి యామార్చారు. వాటిని కాంతారావు తీసుకునే ప్రయత్నంలో ఉండగా సైకిల్ క్యారేజిపై ఉంచిన రూ.3.90లక్షల నగదు బ్యాగును వారు అపహరించుకొని పరారయ్యారు. గమనించిన బాధితుడు కాంతారావు ఇరుగుపొరుగువారికి విషయం తెలిపేలోపు వారు పరారయ్యారు. కాంతారావు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

- నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని ఢీకొన్న ద్విచక్ర వాహనం

వేటపాలెం(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నడుచుకుంటూ వెళుతున్న వృద్ధుడిని ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ఘటన వేటపాలెం మండలం జాతీయ రహదారిలోని గాయత్రి రెస్టారెంట్ సమీపంలో చోటుచేసుకుంది. వేటపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక జబ్బార్ కాలనీకు చెందిన షేక్ షాహిద్(60) కాలినడకన రెస్టారెంట్ వైపు నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. దీంతో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం వేగంగా ఢీ కొనడంతో ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్‌కు వేటపాలెం మండల పరిధిలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు చల్లారెడ్డి పాలెం, అక్కయ్యపాలెం, లక్ష్మీపురం, కొత్తపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం గ్రామాల్లో సేవలకు అంతరాయం ఉంటుందన్నారు.

డ్రోన్లతో రైతులకు బహుళ ప్రయోజనాలు


డ్రోనును అందజేస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

మేదరమెట్ల, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో డ్రోన్లను ఉపయోగించడం ద్వారా ఎన్నో లాభాలున్నాయని, అద్దంకి ఏడీఏ బి. ఎఫ్రాయం తెలిపారు. శుక్రవారం మండలంలోని రావినూతల, పమిడి పాడు గ్రామాల్లో రెండు గ్రూపులకు డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .డ్రోన్ కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లకు 80 శాతం రాయితీతో డ్రోన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ డ్రోన్లను రైతులు ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించాలన్నారు. పురుగు మందుల పిచికారి కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులం దరూ ఉపయోగించు కోలన్నారు. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ. 9.80 లక్షలు కాగా, రాయితీ రూ.7.80 లక్షలు పోను రూ.2 లక్షలు ఈ గ్రూపు చెల్లించాలన్నారు.

పమిడిపాడు సొసైటీలో రైతులకు 25 శాతం రాయితీపై శనగ విత్తనాలను సొసైటీ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ వ్యవసాయాధి కారులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిన్నక శ్రీధర్, మామిళ్ల ఎల్లి హనుమంతరావు, కామినేని శ్రీనివాసరావు, పిన్నక శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అనుసరించే వాహనాలు నడపాలి

- ప్రైవేటు ట్రావెల్స్, లారీలు తనిఖీ చేసిన సీఐ శేషగిరిరావు


బస్సును తనిఖీ చేస్తున్న సీఐ శేషగిరిరావు

వేటపాలెం (చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అనుసరించే వాహనాలు నడపాలని రూరల్ సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి వేటపాలెం ఎస్సై జనార్ధన్‌తో కలిసి 216 జాతీయ రహదారిలో ప్రైవేట్ ట్రావెల్స్, లారీలను తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ప్రజల ప్రాణాల పట్ల వాహనాల డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదాలకు బాటలు వేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అధికారులు వెంట ట్రైనీ ఎస్సైలు అలేఖ్య, జగ్జీవన్‌రావు, కానిస్టేబుల్ మల్లి తదితరులు ఉన్నారు.